


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 70 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 21 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 70 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 21 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# సిట్ నన్ను అడగడం కాదు.. నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

## ఏడు గంటల విచారణ అనంతరం హరీశ్ రావు



- దమ్ముంటే విచారణకు సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని సవాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకేం సంబంధమని ప్రశ్న
- అప్పుడు నేను హోంమంత్రిగా పని చేశానా అని నిలదీత

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తనను ప్రశ్నించడం కాదని, తానే సిట్‌కు వంద ప్రశ్నలు వేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను హోంమంత్రిగా ఎప్పుడైనా పని చేశానా అని వ్యాఖ్యానించారు. నాటి డీజీపీ, చీఫ్ ఇంటెలిజెన్స్‌ను కూడా విచారణకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు దాదాపు ఏడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నోటీసులు, విచారణలు బీఆర్ఎస్‌ను భయపెట్టలేవని ఆయన అన్నారు. రేపు ప్రజా కోర్టులో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో

- మిగతా 2లో...



## చలాన్లు చెల్లించమని బలవంతపెట్టొద్దు

### ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

- వాహనం లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదన్న హైకోర్టు
- వాహనదారుడు చెల్లిస్తేనే చలానా మొత్తం తీసుకోవాలన్న హైకోర్టు
- వాహనదారుడికి చెల్లించడం ఇష్టంలేకపోతే నోటీసులు జారీ చేయాలన్న హైకోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** పెండింగ్ చలాన్ల విషయంలో ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాహనదారులను పెండింగ్ చలాన్లు చెల్లించమని బలవంతపెట్టొద్దని ఆదేశించింది. చలాన్లు చెల్లించాలని బైక్ కీస్ లాక్కోవడం, వాహనాన్ని ఆపేయడం

- మిగతా 2లో...



## ఫ్రాన్స్ షాంపేన్ పై 200 శాతం పన్ను.. ట్రంప్ తాజా వార్నింగ్

- అమెరికా శాంతి మండలిలో చేరబోనన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్
- తన ఆహ్వానాన్ని తిరస్కరించడంపై ట్రంప్ సీరియస్
- ఫ్రాన్స్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే షాంపేన్, వైన్ లపై భారీ సుంకాలు

- మిగతా 2లో...



## ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా...

### ఎక్స్ యూజర్లను అభిప్రాయం అడిగిన ఎలాన్ మస్క్

- ర్యాన్‌ఎయిర్ సీఈఓతో మాటల యుద్ధం తర్వాత మస్క్ సంచలన పోల్
- ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేయాలా అని ఎక్స్‌లో యూజర్ల అభిప్రాయ సేకరణ
- విమానాల్లో స్టార్‌లింక్ వైఫై ఏర్పాటుపై వివాదంతో మొదలైన గొడవ
- కొనుగోలుకు అనుకూలంగా 76 శాతానికి పైగా యూజర్ల ఓటు
- ఒకరినొకరు 'ఇడియట్' అంటూ దూషించుకున్న ఇద్దరు సీఈఓలు

- మిగతా 2లో...

## ఇకపై నితిన్ నబినే నా బాస్.. నేను కార్యకర్తను మాత్రమే

- బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్
- పార్టీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన జాతీయ అధ్యక్షుడిగా గుర్తింపు
- నూతన అధ్యక్షుడిని అభినందించిన మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్
- వికసిత భారత్ లక్ష్య సాధనలో నబిన్ నాయకత్వం కీలకమన్న ప్రధాని

- మిగతా 2లో...



## అసెంబ్లీ నుంచి అలిగి వెళ్లిపోయిన గవర్నర్..

### తమిళనాడులో మరో వివాదం

- సీఎం స్టాలిన్ వర్సెస్ గవర్నర్ ఆర్.ఎన్.రవి
- అసెంబ్లీలో జాతీయ గీతం ఆలపించలేదని ఆరోపించిన గవర్నర్
- తాను కోరినా స్పీకర్ వినిపించుకోలేదని ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు అసెంబ్లీలో మరో వివాదం రేగింది. అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ప్రసంగించాల్సిన గవర్నర్ మధ్యలోనే వెళ్లిపోయారు. సభలో జాతీయ గీతం పాడాలని కోరినా సభాపతి వినిపించుకోలేదని లోక్‌భవన్ వెల్లడించింది. దేశంలోని అన్ని శాసన సభలలో గవర్నర్ ప్రసంగానికి ముందు జాతీయ గీతాలాపన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందని, స్టాలిన్ సర్కారు మాత్రం ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తోందని పేర్కొంది. దీనికి నిరసనగా గవర్నర్ ఆర్.ఎన్.రవి అసెంబ్లీ

- మిగతా 2లో...



## ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

- దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం
- ఏఐ, హెల్త్ టెక్, అగ్రి టెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్ రంగాల్లో ఇజ్రాయెల్ మద్దతు
- ఇజ్రాయెల్ స్టార్టప్‌లతో తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్ పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సమావేశమైంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), హెల్త్ టెక్, అగ్రి టెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరో స్పేస్ రంగాల్లో

- మిగతా 2లో...

## నేల విషతుల్యమవుతోంది


- సేంద్రియ వ్యవసాయంపై సదస్సులో పాల్గొన్న నారాయణ, చిన్న జీయర్ స్వామి
- ప్రతి రైతు సేంద్రియ సాగు వైపు మళ్లాలన్న నారాయణ
- అత్యాశ వల్ల ప్రకృతి నాశనం అవుతోందన్న జీయర్ స్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:** నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగంతో నేల విషతుల్యమవుతోందని, దీని ప్రభావం

- మిగతా 2లో...

## దుర్గం చెరువును వారు పట్టించుకోవడం లేదు



- దుర్గం చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- దుర్గం చెరువులో పెరిగిన గుర్రపుడెక్క
- బాధ్యతను హైడ్రా తీసుకుంటుందన్న రంగనాథ్

**హైదరాబాద్ పెన్ పవర్:** దుర్గం చెరువును సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇక నుంచి ఆ బాధ్యతను తాము తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. దుర్గం చెరువు, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల, రహేజా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సమీప ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరడం వల్లే దుర్గం చెరువులో గుర్రపుడెక్క భారీగా పెరిగిందని రంగనాథ్ అన్నారు.

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

### ఆదివాసీల సంస్కృతికి నిలువుటద్దం నాగోబా జాతర

తెలంగాణ సంస్కృతి అంటే రాజప్రాసాదాలు, శిల్పకళ వైభవం మాత్రమే కాదు. అడవి తల్లి ఒడిలో, కొండగుట్టల నడుమ ప్రకృతితో మమేకమైన జీవన విధానమే అసలైన తెలంగాణ తత్వం. ఆ జీవన తత్వానికి అద్దం పట్టే మహోత్సవమే నాగోబా జాతర. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక కాదు. ప్రకృతి పూజగా, సామూహిక ఐక్యతకు ప్రతీకగా, తరతరాలుగా నిలిచిన సంప్రదాయ గౌరవంతో గిరిజన జీవన సంస్కృతిని ప్రతిబింబించే మహోత్సవంగా నాగోబా జాతర తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తుంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నాగోబా జాతర గిరిజన సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు.. ఆత్మగౌరవానికి ప్రతీక. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద జరిగే ఈ జాతరలో గోండులు, కొలాములు, నాయక్పోడ్లు, ప్రాధాన్లు సహా అనేక ఆదివాసీ తెగలు తమ సంప్రదాయాలను ఆచరిస్తారు. నాగోబా దేవతను సర్పరూప దైవంగా భావిస్తూ, ప్రకృతిని తల్లి రూపంలో పూజించే గిరిజన విశ్వాసం ఈ జాతరలో స్పష్టంగా దర్శనమిస్తుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు, గిరిజనులు, పరిశోధకులు, పర్యాటకులు ఈ జాతరకు తరలివస్తారు. ఇది ఒక జాతరగా మొదలై, కాలక్రమంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవంగా ఎదిగింది. అయితే ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ జాతర గతంలో మౌలిక సదుపాయాల కొరతతోనే కొనసాగింది. రహదారుల లేమి, వైద్య సౌకర్యాల లోపం, తాగునీటి సమస్యలు, భద్రతా ఏర్పాట్ల అసమర్థత భక్తులకు ఇబ్బందులు కలిగించాయి. ఈ పరిస్థితిని మార్చాలన్న స్పష్టమైన సంకల్పంతో ఈసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నాగోబా జాతరకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల విశ్వాసాన్ని పాలనా బాధ్యతగా భావిస్తూ, జాతరను రాష్ట్ర ప్రతిష్ఠకు ప్రతీకగా నిలపాలన్న దృక్పథంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలను రూపొందించి, భక్తుల సౌకర్యం కేంద్రంగా ఏర్పాట్లను చేపట్టింది. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రహదారుల నిర్మాణం, విస్తృత పార్కింగ్ సదుపాయాలు, బస్సు రూట్ల పునర్వ్యవస్థీకరణ, ప్రత్యేక షటిల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వెయ్యికిపైగా బస్సులతో షటిల్ సేవలు అందిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నాగోబా జాతరలో ఆరోగ్య సేవలు అత్యంత కీలకం. అందుకే ప్రభుత్వం 24 గంటల వైద్య శిబిరాలు, మొబైల్ హాస్పిటల్స్, 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 500 మెడికల్ టీంలు, 50 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధమయ్యింది. తాగునీటి కోసం 1000 (వెయ్యి)కి పైగా ట్యాంకర్లు, వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయడంతోపాటు పరిశుభ్రత కోసం 1,000 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించింది. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా ఈ చర్యలు పాలనలో మారుతున్న దృక్పథానికి సంకేతంగా చూడాలి. భద్రతా ఏర్పాట్లలోనూ ప్రభుత్వం రాజీపడలేదు. 5 వేల మంది పోలీసులు, 2 వేల హోంగార్డులు, మహిళా పోలీస్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నాయి. డ్రోన్ కెమెరాలు, 500 సిసిటివి కెమెరాలతో జనసందోహ నియంత్రణ, నిఘా పర్యవేక్షణ చేపట్టారు. అప్రమత్తత చర్యలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం గమనార్హం. నాగోబా జాతర గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక. అందుకే ఈ వేడుకను ప్రభుత్వం కేవలం పరిపాలనా కార్యక్రమంగా కాకుండా, సాంస్కృతిక ఉత్సవంగా చూడటం కీలకంగా భావించవచ్చు. గిరిజన కళాకారుల నృత్యాలు, వాద్యప్రదర్శనలు, సంప్రదాయ పూజా విధానాలను ప్రోత్సహిస్తూ వారి కళావారసత్వాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నారు. 200కు పైగా గిరిజన స్వయం ఉపాధి సంఘాలకు స్టాళ్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా బలపరచడం కూడా ఒక కీలక అడుగుగా గుర్తించాలి. నాగోబా జాతరను అంతర్జాతీయ స్థాయి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలన్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక శాఖ ప్రత్యేక ప్రచారం, సమాచార కేంద్రాలు, డిజిటల్ గైడ్ సేవలు ఏర్పాటు చేసి సందర్శకులకు పూర్తి సమాచారం అందిస్తోంది. ఇది గిరిజన సంస్కృతిని కేవలం ప్రదర్శనగా కాకుండా, ప్రపంచానికి మన ఖ్యాతిని పరిచయం చేసే ప్రయత్నమని చెప్పుకోవచ్చు. నాగోబా జాతరకు ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధుల కేటాయించడంతో పాటు, ఈ జాతరను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు మంత్రుల ప్రత్యక్ష పర్యవేక్షణ, గిరిజన నాయకులు -ఆలయ కమిటీలతో సమన్వయం వంటి వినూత్న చర్యలకు ప్రభుత్వం అనేక రకాలు బాధ్యతలు తీసుకుంది. ఇది ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈసారి చేపట్టిన ఏర్పాట్లు తాత్కాలిక అవసరాలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ప్రతి ఏటా మెరుగైన జాతర నిర్వహణకు దోహదపడేలా శాశ్వత మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పర్యాటక మౌలిక సదుపాయాల పెంపు వంటి దీర్ఘకాలిక ప్రణాళికలతో కొనసాగుతోంది. ఆదివాసీ సంప్రదాయాలను యునెస్కో స్థాయికి తీసుకెళ్లాలన్న ఆలోచన ఈ ప్రయత్నాలకు దిశానిర్దేశం చేస్తోంది. మొత్తానికి నాగోబా జాతర తెలంగాణ గిరిజన జీవన సంస్కృతికి ప్రతిరూపం. ప్రజల విశ్వాసాన్ని పాలన పునాదిగా తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ పకడ్బందీ ఏర్పాట్లు.. ఒక ఉత్సవ నిర్వహణకే పరిమితం కావు. అవి తెలంగాణ ప్రజల జీవన విలువలకు, ఆదివాసీల సంస్కృతికి ఇచ్చిన గౌరవం. అందుకే ఈ నాగోబా జాతర.. ఇకపై, చరిత్రలో నిలిచే ప్రజల పండుగగా వర్ధిల్లనుంది.

# నేల విషతుల్యమవుతోంది

- మొదటి పేజి తరువాయి

ప్రజల ఆరోగ్యంపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలాగే ప్రతి రైతు సేంద్రియ సాగు వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.దేశంలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నప్పటికీ యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని నారాయణ అన్నారు. విత్తనాలు, ఎరువుల కంపెనీలు కార్పొరేట్ల చేతుల్లో ఉండటంతో లాభాలు బడా కంపెనీలకే చేరుతున్నాయని విమర్శించారు. చివరి ఊపిరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సదస్సులో త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి కూడా పాల్గొని ప్రసంగించారు. భూమి పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అత్యాశ వల్ల ప్రకృతి సమూల నాశనం అవుతోందని హెచ్చరించారు. హైబ్రిడ్ సాగు, పశుపోషణ వల్ల రోగాలు పెరుగుతున్నాయని, నేటి ఆహారం ఎక్కువగా కలుషితమైందని తెలిపారు. ప్రకృతి బాగుంటేనే మనిషి జీవించగలడని, భూమికీ ప్రాణం ఉందని, దానికి కూడా విరామం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా...

టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తన సోషల్ మీడియా పోస్ట్‌తో సంచలనం సృష్టించారు. యూరప్‌కు చెందిన అతిపెద్ద బడ్జెట్ ఎయిర్‌లైన్ 'ర్యాన్ఎయిర్'ను కొనుగోలు చేయమంటారా? అంటూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోల్ ప్రారంభించారు. ర్యాన్ఎయిర్ సీఈఓ మైఖేల్ ఓ'లియరీతో జరిగిన తీవ్ర వాగ్వాదం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.ర్యాన్ఎయిర్ విమానాల్లో స్టార్‌లింక్ సేవలను ఇన్‌ఫ్లైట్ వైఫైగా ఉపయోగించడంపై మొదలైన వ్యాపార విభేదం వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. తమ వ్యాపారానికి స్టార్‌లింక్ ఖర్చులు సరిపడవని ర్యాన్ఎయిర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ర్యాన్ఎయిర్ సీఈఓ ఓ'లియరీ.. మస్క్‌ను "ఒక ఇడియట్" అని, అతడిని ఎవరూ పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందిస్తూ ఓ'లియరీ "అట్టర్ ఇడియట్" అని, "అతడిని ఉద్యోగంలో నుంచి తీసేయండి" అని పోస్ట్ చేశారు.
ఈ మాటల యుద్ధం నేపథ్యంలోనే మస్క్.. ర్యాన్ఎయిర్‌ను కొనుగోలు చేయాలా వద్దా అని పోల్ నిర్వహించారు. కొద్ది గంటల్లోనే ఈ పోల్‌కు 7,50,000కు పైగా ఓట్లు రాగా, 76.8 శాతం మంది
కొనుగోలుకు మద్దతు తెలిపారు. తనదైన శైలిలో స్పందించిన మస్క్, "ర్యాన్ఎయిర్‌ను 'ర్యాన్' అనే వ్యక్తి నడపాలి, అతడిని అసలైన పాలకుడిగా చేయడం మీ విధి" అంటూ చమత్కరించారు. అయితే, ఇది కేవలం సరదా పోలా లేక నిజంగానే టేకోవర్ చేసే ఉద్దేశం ఉందా అనే దానిపై మస్క్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఫ్రాన్స్ షాంపేన్ పై 200 శాతం పన్ను..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. గాజా పునర్నిర్మాణం కోసం తాను ప్రతిపాదించిన శాంతి మండలి (బోర్డ్ ఆఫ్ పీస్)లో చేరేందుకు విముఖత ప్రదర్శించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఫ్రాన్స్ నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వైన్, షాంపేన్ లపై ఏకంగా 200 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. అయితే, టారిఫ్ లు విధిస్తానంటూ ట్రంప్ చేస్తున్న బెదిరింపులకు తాము లొంగబోమని మాక్రాన్ స్పష్టం చేశారు.

**మండలి నిబంధనలపై మాక్రాన్ అభ్యంతరం..**

ఇజ్రాయెల్ తో జరిగిన యుద్ధంలో గాజా పూర్తిగా చితికిపోయిన విషయం తెలిసిందే. యుద్ధం జరుగుతున్న సమయంలోనే గాజా పునర్నిర్మాణ బాధ్యత తమదేనని ట్రంప్ ప్రకటించారు. శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించి ఇజ్రాయెల్ తో యుద్ధం విరమింపజేశారు. గతంలో చెప్పినట్లుగానే గాజా పునర్నిర్మాణం దిశగా ట్రంప్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే శాంతి మండలి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. అందులో చేరాలంటూ వివిధ దేశాలకు ఆహ్వానం పలికారు.
ఫ్రాన్స్ కు కూడా ఆహ్వానం పలకగా.. మాక్రాన్ సున్నితంగా తిరస్కరించారు. శాంతి మండలి నిబంధనలు గాజా ప్రాంతానికే పరిమితం కాదని, మండలి పరిధి విస్తృతంగా ఉందని మాక్రాన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి సూత్రాలకు విరుద్ధంగా ఉండే అవకాశం ఉందన్నారు. అందుకే ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు మాక్రాన్ వెల్లడించారు.
రష్యా, అర్జెంటీనా, భారత్, పాకిస్థాన్ సహా పలు దేశాలను శాంతి మండలిలో చేర్పించేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. దావోస్‌లో జరగనున్న సదస్సులో దీనిపై సంతకాలు చేయించాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఈ మండలిలో శాశ్వత సభ్యత్వం ఆశించే దేశాలు కనీసం 1 బిలియన్ డాలర్ల నిధులు సమకూర్చాలని ట్రంప్ నిబంధన పెట్టారు.

## అసెంబ్లీ నుంచి అలిగి వెళ్లిపోయిన గవర్నర్..

- మొదటి పేజి తరువాయి

నుంచి వాకౌట్ చేసినట్లు సమాచారం.
ఈ పరిణామాలపై గవర్నర్ కార్యాలయం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సభలో జాతీయ గీతాన్ని పాడకుండా ప్రభుత్వం అవమానించిందని లోక్ భవన్ విమర్శించింది. ప్రాథమిక రాజ్యాంగ విధిని విస్మరించిందని, గవర్నర్ ప్రసంగించడానికి వెళ్లిన సమయంలో మైక్‌ను పదేపదే ఆపివేశారని ఆరోపించింది. అసెంబ్లీలో తరచూ జాతీయగీతాన్ని అవమానిస్తుండడాన్ని సహించలేక గవర్నర్ సభలో నుంచి వెళ్లిపోయారని తెలిపింది.
ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ కాపీలో అసత్య, నిరాధారమైన ప్రకటనలు ఉండడంతో ఆ కాపీని చదవడానికి గవర్నర్ నిరాకరించినట్లు పేర్కొంది. రాష్ట్రంలో దళితులపై జరుగుతోన్న దారుణాలు, మహిళలపై లైంగిక హింస వంటి సమస్యల గురించి ప్రసంగ కాపీలో ప్రస్తావించలేదని లోక్‌భవన్ తన ప్రకటనలో ఆరోపించింది.

**సభను అవమానించడమే..: సీఎం స్టాలిన్**

అసెంబ్లీ నుంచి గవర్నర్ ఆర్.ఎన్.రవి వాకౌట్ చేయడంపై సీఎం స్టాలిన్ స్పందిస్తూ.. సభా సాంప్రదాయాన్ని, నైతికతను గవర్నర్ ఉల్లంఘించారని విమర్శించారు. ప్రభుత్వం రూపొందించే ప్రసంగ కాపీలో గవర్నర్ అభిప్రాయాలను చేర్చాలన్న నిబంధన ఎక్కడా లేదని స్టాలిన్ గుర్తుచేశారు. గవర్నర్ ఆర్.ఎన్.రవి ఉద్దేశపూర్వకంగానే సభను అవమానించడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని సీఎం ఎం.కే.స్టాలిన్ మండిపడ్డారు.

## సిట్ నన్ను అడగడం కాదు.. నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

- మొదటి పేజి తరువాయి

ఇచ్చిన హామీల గురించి మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు.అరెస్టులు తమకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ముగ్గురు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు బృందం తనను ప్రశ్నించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయతీపరుడైతే ఈ అంశంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా పోలీసులను వెనుకబెట్టుకుని కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, సిట్ అధికారులు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆయన అన్నారు.వారి కుంభకోణాలు, చీకటి రాజకీయాలను బయటపెడుతున్నామని తమపై కేసులు పెడుతున్నారని హరీశ్ ఆరోపించారు. మీ దోపిడీలను ప్రశ్నిస్తున్నామని, మాపై కేసులు పెడతారా అని నిలదీశారు. తమపై అన్నీ నిరాధార ఆరోపణలేనని, సొల్లు పురాణాలేనని విమర్శించారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వింటేనే రోత పుడుతోందని అన్నారు.
రేవంత్ రెడ్డిలా తమకు వెన్నుపోట్లు తెలియవని, పోరాటాలు ద
మాత్రమే తెలుసని ఆయన అన్నారు. కేసీఆర్ తమకు నేర్పింది పోరాటమే అన్నారు. ఇప్పుడు తనకు సిట్ ద్వారా వచ్చిన నోటీసులు మీ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ధైర్యం ఉంటే తమను రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. మీ చిల్లర, బురద, కుట్ర, కుతంత్రాల రాజకీయాలు ఇక నడవవని అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు విస్మరించారని ఆరోపించారు.

## ఇకపై నితిన్ నబినే నా బాస్.. నేను కార్యకర్తను మాత్రమే

బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ (46) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో ఈ పదవిని చేపట్టిన నేతగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. "ఇకపై పార్టీ వ్యవహారాల్లో నితిన్ నబిన్ నా బాస్, నేను ఒక సాధారణ కార్యకర్తను మాత్రమే" అని మోదీ పేర్కొన్నారు.మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'సంఘటన్ పర్వ్' కార్యక్రమంలో నితిన్ నబిన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా.. నూతన అధ్యక్షుడిని సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పార్టీ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. "ప్రభుత్వ అధినేతగా నాకు ఎంత అనుభవం ఉన్నా, అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఈ విషయంలో గర్వపడతాను" అని మోదీ అన్నారు. "వికసిత భారత్ నిర్మాణానికి రానున్న 25 ఏళ్లు చాలా కీలకం. ఈ ముఖ్యమైన సమయంలో నితిన్ నబిన్ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఆయన ఒక మిలీనియల్ (జనరేషన్ వై... జెన్ జెడ్ కు ముందు తరం), యువ శక్తితో పాటు సంస్థాగత అనుభవం కూడా ఉంది" అని ప్రధాని ప్రశంసించారు.అటల్ జీ, అద్వానీజీ నుంచి జేపీ నడ్డా వరకు పార్టీ అధ్యక్షులుగా చేసిన సేవలను మోదీ గుర్తు చేసుకున్నారు. నాయకులు మారినా పార్టీ సిద్ధాంతాలు, దిశ మారవని స్పష్టం చేశారు. అనంతరం మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన యువకుడైన నితిన్ నబిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం చరిత్రాత్మకమని అన్నారు. పార్టీకి మార్గనిర్దేశం చేసిన ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఒక్కరే నామినేషన్ వేయడంతో బీజేపీ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎలక్టోరల్ కాలేజ్ నితిన్ నబిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## దుర్గం చెరువును వారు పట్టించుకోవడం లేదు

- మొదటి పేజి తరువాయి

అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.దుర్గం చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పర్యాటకం దెబ్బతిన్నది. చెరువులో పర్యాటక బోట్లు కూడా తిరగడం లేదు. బోటింగ్ లేకపోవడంతో సందర్శనకు వచ్చిన పర్యాటకులు నిరాశతో వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ దుర్గం చెరువును సందర్శించారు.

## ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

- మొదటి పేజి తరువాయి


తెలంగాణకు ఇజ్రాయెల్ మద్దతునివ్వనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.వ్యవసాయం, వాతావరణ సంబంధిత ఇన్నోవేషన్ స్టార్టప్‌లపై వారి మధ్య చర్చ జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఇజ్రాయెల్ స్టార్టప్‌లతో రాష్ట్రంలో పైలట్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

## చలాన్లు చెల్లించమని బలవంత పెట్టొద్దు

- మొదటి పేజి తరువాయి

లాంటివి చేయొద్దని హెచ్చరించింది. వాహనదారులు స్వచ్ఛందంగా చలాన్లు చెల్లిస్తేనే పోలీసులు వసూల్ చేసుకోవాలని పేర్కొంది.ఒక వేళ పోలీసులు పెండింగ్ చలాన్లు వసూల్ చేయాలని భావిస్తే చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి వసూల్ చేయాలని సూచించింది. కాగా, ట్రాఫిక్ పోలీసులు నడి రోడ్డుపై బండ్లు ఆపి, తాళం లాక్కొని బలవంతంగా చలాన్లు వసూలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం (జనవరి 20) కోర్టులో విచారణ జరిగింది.
ాశ్రీంశీ =ఘుః : చీరల కోసం అర్థరాత్రి నుంచే క్యూ
పిటిషనర్ తరుపున న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్ల వసూల్ కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బందిపెడుతున్నారని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పెండింగ్ చలాన్ల విషయంలో ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బలవంతంగా పెండింగ్ చలాన్లు వసూల్ చేయొద్దని పోలీసులను ఆదేశించింది.

# ఖాజాగూడ చెరువు కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు..
# రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఖాజాగూడ చెరువు కబ్జాలపై ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. మంగళవారం ( జనవరి 20 ) ఖాజాగూడ చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు కమిషనర్ రంగనాథ్. ఖాజాగూడ చెరువు తూములు, అలుగులు మూసివేసినట్టు గుర్తించామని తెలిపారు రంగనాథ్. చెరువు నీటి ప్రవాహాన్ని డైవర్ట్ చేసినట్టు నిర్ధారించామని.. చెరువుకు అనుసంధానంగా ఉన్న కిందభాగంలోని చిన్న చెరువు రూపురేఖలు మార్చినట్టు గుర్తించామని తెలిపారు.ఖాజాగూడ చెరువు ఆనవాళ్లు లేకుండా చేయడంపై సీరియస్ అయ్యారు కమిషనర్ రంగనాథ్. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించామని.. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో షెడ్డులు నిర్మించినట్టు పరిశీలనలో వెల్లడయ్యిందని అన్నారు. చెరువు కబ్జాలపై పూర్తి స్థాయిలో లెక్కలు తేల్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు రంగనాథ్.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

# రూ. 1,600 కోట్ల బొగ్గు గనుల విషయంలో రేవంత్, మంత్రుల మధ్య విభేదాలు వచ్చాయి

- కాంట్రాక్టుల్లో అవినీతిని బయటపెట్టినందుకే హరీశ్ రావును టార్గెట్ చేశారన్న వేముల
- సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినా వేధిస్తున్నారని మండిపాటు
- దండుపాళ్యం ముఠా రాష్ట్రాన్ని నడుపుతోందని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**సింగరేణి బొగ్గు గనుల కాంట్రాక్టుల్లో జరిగిన భారీ అవినీతిని బయటపెట్టినందుకే మాజీ మంత్రి హరీశ్ రావును టార్గెట్ చేసి సిట్ నోటీసులు జారీ చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్య అని మండిపడ్డారు. సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ కావాలనే హరీశ్ రావును వేధిస్తున్నారని అన్నారు.అసెంబ్లీ వేదికగా, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తుంటే కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేస్, విద్యుత్ అంశాల పేరుతో విచారణలంటూ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎంతమంది నోటీసులు ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రాన్ని దండుపాళ్యం ముఠా నడుపుతోందని, ఆ ముఠాకు నాయకుడు సీఎం రేవంత్ రెడ్డేనని వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సివిల్ సప్లయ్, సమ్మక్క సారలమ్మ టెండర్లు, పారిశ్రామిక భూముల కేటాయింపుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. రూ. 1,600 కోట్ల బొగ్గు గనుల కాంట్రాక్ట్ విషయంలో సీఎం, మంత్రుల మధ్యే విభేదాలు వచ్చాయని తెలిపారు.రోజుకొక కుంభకోణంతో ప్రభుత్వం నడుస్తోందని విమర్శించిన ఆయన, ప్రభుత్వ అవినీతిపై కూడా సిట్ వేయాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు ప్రజల కోసం పోరాడిన నాయకుడని, ఆయన వెంట తెలంగాణ సమాజం మొత్తం ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.




# అధికారుల కృషితో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ

## మూసి పరివాహక ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా



మేడిపల్లి, పెన్ పవర్ జనవరి 20: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు నేతృత్వంలో విద్యుత్ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆయన నిరంతర పర్యవేక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేస్తూ, సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మూసి పరివాహక ప్రాంతాల్లో గత కొంతకాలంగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార మార్గాలు చూపుతున్నారు.హబ్సిగూడ డివిజన్ పరిధిలో ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా సి.ఈ కామేష్, ఎస్.ఈ పి. వెంకన్న, డి. లింగయ్య, ఏడీఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ రెడ్డిలు స్వయంగా కాలనీలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తూ విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు.చాలా కాలంగా పాడైపోయిన విద్యుత్ కండక్టర్లను తొలగించి, వాటి స్థానంలో ఆధునిక ఏబీ (ఏరియల్ బంచ్డ్) కేబుల్స్‌ను అమర్చడం వల్ల విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడింది. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గడమే కాకుండా షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు కూడా తగ్గాయని అధికారులు తెలిపారు.విద్యుత్ సమస్యలు పరిష్కరించినందుకు బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించిన డైరెక్టర్ నరసింహులు, ఎస్.ఈ వెంకన్న, ఏఈ సత్యనారాయణ రెడ్డిలకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ అధ్యక్షులు మునికుంట్ల నరేష్ గౌడ్, సెక్రటరీ రావు నాగిరెడ్డి, అడ్వైజర్ ఎస్వీఎస్ ప్రసాద్, కాలనీవాసులు రాజు, మునికుంట్ల యాదగిరి, పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు నిమిషానికి 4 బస్సులు.. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు..



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడారం జాతరను పురస్కరించుకొని ఒక్క నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రత్యేకంగా నాలుగు వేల బస్సులను ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవ రి 1 వ తేదీ వరకు నడపనున్నట్లు చెప్పారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 51 పాయింట్లు ఏర్పాటు చేశామ న్నారు. రవాణాశాఖ నుంచి 10 వేల మంది సేవల్లో ఉంటారని వివరించారు. ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు.మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని వివరించారు. మేడరం వెళ్ళేటప్పుడు బస్సులు నిండుతాయి... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని, ఇందుకోసం ఫ్రీ బస్సు వర్తించని వారి వద్ద నుంచి 50% చార్జీలు అదనంగా వసూలు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల కోసం 50 క్యూలైన్స్ 9 కిలోమీటర్లు ఏర్పాటు చేశా మన్నారు.

- మిగతా 4లో...

# తెలంగాణ సీఐడీ సంచలన నిర్ణయం
# ఇక నుంచి ఇంటి దగ్గరే ఫిర్యాదు స్వీకరణ




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సీఐడీ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా పౌర కేంద్రిత పోలీసింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేక కేసుల్లో బాధితుల ఇంటి దగ్గరికే వెళ్లి సీఐడీ ఫిర్యాదులు స్వీకరించనుంది. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, శారీరక దాడులు, ఆస్తి వివాదాలు, పోక్సో చట్టం కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్యవివాహాలు, ర్యాగింగ్ వంటి ప్రత్యేక కేసుల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మౌఖికంగా లేదా ఫోన్ చేస్తే పోలీసులే ఇంటి దగ్గరికే వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, పోక్సో, ర్యాగింగ్ వంటి కేసుల్లో ఫిర్యాదు చేసేందుకు పీఎస్‌కు వెళ్లాలంటే ఇబ్బంది, భయపడే బాధితులకు ఈ నిర్ణయం ఊరట కల్గించనుంది. సీఐడీ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జనవరి 25 లేదా 26న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** జనవరి 25 లేదా 26న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం (జనవరి 20) నర్సాపూర్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రజల్లో ఉన్న గెలుపు గుర్రాలకే చాన్స్ ఇస్తామని చెప్పారు. అసమ్మతి నేతల పోరు ఉండకూడదన్నారు. కాంగ్రెస్ చేస్తోన్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేడర్‌కు సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో కూడా కాంగ్రెస్ మొదట కాస్తా వెనకంజలో ఉందని.. కానీ చివరకు జూబ్లీహిల్స్ బై పోల్ గెలిచి చూపించామని అన్నారు. కానీ నర్సాపూర్ అలా కాదని.. ఇక్కడ కాంగ్రెస్ చాలా స్ట్రాంగ్ ఉందన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.

# అది సిట్ కాదు.. పిచ్చి విచారణ

- హరీశ్ రావు సిట్ విచారణపై కేటీఆర్ ఆగ్రహం
- అది సిట్ విచారణ కాదు, పిచ్చి విచారణ అని వ్యాఖ్య
- సింగరేణి టెండర్ల స్కాంలో సీఎం బావమరిది సూత్రధారి అని ఆరోపణ
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ విచారించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోందని ఆరోపించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డేనని సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మంత్రుల చుట్టూ వరుస వివాదాలు

**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:**
రకరకాల ఆరోపణలు.. రకరకాల వివాదాలు.. తెలంగాణ మంత్రుల చుట్టూ కనిపిస్తున్న పరిణామాలు ఇవే.! ఇవిప్పుడు మరింత రచ్చకెక్కాయా అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయంపొగలు కక్కుతోంది. మంత్రుల మధ్య విభేదాలు, వివాదాలు.. ఉన్నతాధికారులకు శాపంగా మారుతున్నాయా? మంత్రుల తీరుపై నిఘా పెట్టిన సీఎం రేవంత్.. పూర్తి స్థాయిలో ఆరా తీయడం స్టార్ట్ చేశారా? అసలేంజరుగుతోంది..జూపల్లి నుంచి ఇప్పుడు భట్టి వరకు.. తెలంగాణలో మంత్రుల చుట్టూ వరుస వివాదాలు కనిపిస్తున్నాయ్. మరికొందరు మంత్రులపై వినిపిస్తున్న ఆరోపణలు.. ఇంకొందరు మంత్రుల మధ్య కనిపిస్తున్నవిభేదాలు.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తున్నాయ్. ఈ పరిణామాలు సీఎం రేవంత్‌కు కొత్త తలపోటుగా మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యే ఓ మంత్రిపై కథనం ప్రసారంకావడం..తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా కాక పుట్టించగా.. ఇప్పుడు ఆ వివాదం కొత్త మలుపు తీసుకుంది. బొగ్గు గనుల వ్యవహారం తెరమీదకు వచ్చింది. మంత్రుల మధ్య విభేదాలకు, లీక్‌లకు కూడా.. బొగ్గు బ్లాక్‌లవ్యవహారమనే గుసగుసలు వినిపించడం.. కథనాలు రావడంపై ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చ మొదలైంది. ఇది అటు తిరిగి.. డిప్యూటీ సీఎం భట్టి టార్గెట్ అయ్యేలా చేసింది. దీంతో ఆయన స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు.ఆ గనుల కోసం కొత్తగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.ఇప్పుడు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. గతంలో మరికొందరు మంత్రుల చుట్టూ ఇలాంటి ఆరోపణలు, వివాదాలే వినిపించాయ్. సీనియర్ ఐఏఎస్సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి, ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య వివాదం.. అప్పట్లో తెలంగాణ రాజకీయాల్లో కాక పుట్టించింది. రిజ్వి తన ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించిన జూపల్లి.. స్వయంగా ఓ
లేఖ రాయడం అప్పట్లో కలకలం రేపింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్‌లో ట్విస్టుల మీద ట్విస్టులు కనిపించాయ్.రిజ్వి వీఆర్ఎస్ ఆమోదించొద్దంటూ సీఎస్‌తో పాటు సీఎంకు జూపల్లి మరో లేఖ రాయడం.. విభేదాలను మరింతబహిర్గతం చేసినట్లు అయింది. ఇక అటు మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. హస్తం పార్టీలో కొద్దిరోజుల కింద క్రియేట్ చేసిన తుఫాన్ అంతా ఇంతా కాదు.
సీఎం రేవంత్, సలహాదారు నరేందర్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు..
మాజీ ఓఎస్డీ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లినప్పుడు.. సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయ్. సీఎం రేవంత్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. తన తల్లిదండ్రులపై కుట్ర చేస్తున్నారంటూసుస్మిత ఘాటు విమర్శలు చేశారు. కొండా సురేఖ, మురళికి ఏం జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీలో.. అటు అధికారవర్గాల్లో తీవ్ర దుమారం రేగింది. ఈ పరిణామాల
మధ్య జరిగిన కేబినెట్ భేటీకి కూడా సురేఖ దూరంగా ఉండడం.. విభేదాలను మరింత స్ట్రాంగ్ చేసింది.ఆ తర్వాత కొండా సురేఖ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దీనికిముందు.. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటికి.. దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ మధ్య వివాదాలతో.. జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. ఇద్దరు మంత్రుల పంచాయితీఢిల్లీ హైకమాండ్ వరకు వెళ్లింది.ఇక మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో.. మంత్రి పొంగులేటికి విభేదాలు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయ్. చివరికి ఓ ప్రభుత్వ భూమి విషయంలో కోర్టులో పిటిషన్ వేసే వరకు వెళ్లిందిపంచాయితీ. ఇలా ఒకదాని తర్వాత ఒకరు వివాదాలు తెరమీదకు వస్తుంటే.. ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా ఆరోపణలు వినిపిస్తున్నాయ్. కట్ చేస్తే ఎక్కడో పుట్టిన వివాదం.. రకరకాల మలుపులు తిరిగి.. బొగ్గు గనులవ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి చుట్టూ ఆరోపణలు వినిపించగా.. సీఎం రేవంత్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు.వరుస వివాదాలు, ఆరోపణలు.. ప్రతిపక్షానికి ఆయుధంగా మారి..పార్టీని ఇరుకున పెట్టేలా కనిపిస్తున్నాయ్. దీంతో సీఎం రేవంత్ వీటిపై నజర్ పెంచినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో ఆరా తీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక అటు మంత్రులపై వచ్చే ఆరోపణలకువివరణ కావాలంటే.. తనను అడగాలంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది.

# ధనికుల కోసం పార్టీల వెతుకులాట

**వరంగల్ జనవరి 20, పెన్ పవర్:**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు కాసులున్నోళ్లకే కౌన్సిలర్ టికెట్ ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకోసం ధనికులను గుర్తించి వార్డుల వారీగాఅభ్యర్థులను ఎంపిక చేయడానికి కసరత్తు మొదలెట్టినట్లు విస్తృతంగా ప్రచా రం సాగుతోంది. ఇంతకాలం పార్టీ జెండాలు మోసిన సామాన్య కార్యకర్తలకు, నాయకులకు పైసల్లేవనే సాకు తో టిక్కెట్ ఇవ్వకుండా 'మొండిచెయ్యి' చూపిస్తూ, పోటీకి నిలబెట్టేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి.చిన్న మున్సిపాలిటీలో అయితే కనీసం 15 లక్షల నుండి 20 లక్షల రూపాయలు ఖర్చు చేసే స్తోమత ఉన్నవారికే టిక్కట్ల కేటాయింపులో మొదటి ప్రా ధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నా యి. ఇక రిజర్వేషన్ల ప్రకారం ఆయా వార్డు కౌన్సిలర్ పదవితోపాటు మున్సిపల్ చైర్ ప ర్సన్ పదవికి ఎన్నికకు రెండు నుంచి మూ డుకోట్లకు తక్కువ కాకుండా ఖర్చు పెట్టే వారిని తెరపైకి తెస్తున్నారు.రాజకీయాల్లో ఇప్పటివరకు ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్న వారికి రిజర్వేషన్ల కారణంగా పూ ర్తి చేసే అవకాశం లేని నేతలు తమ స్నే హితులు,బందు వర్గాన్ని ఎన్నికల బరిలో నిలపడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. డబ్బులు ఖర్చు పెట్టే స్తోమత ఉండి రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నవారికి పార్టీల నేత లు అన్ని మేము చూసుకుంటాం.. గెలిపించి పదవిలోకూర్చోబెడతామంటూ 'గాలం' వే స్తున్నట్లు ప్రచారం సాగుతుంది.ఉమ్మడి వ రంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. మేడారంలో నిర్వహించిన రాష్ట్ర క్యాబినెట్లో ఎంత వీలైతే అంత తొందరగామున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో మున్సిపల్ ఎ న్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చనే సంకేతాలు వెలువడ్డాయి. దీనితో అధి కార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష, ఇతర రాజకీయ పార్టీలు మున్సిపల్ ఎన్నికల సంగ్రామంలో విజయం సా ధించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.ఆర్థిక, అంగ బలం, రాజకీయ చతురత కలిగిన నేతలను, గెలుపు గుర్రాలను గుర్తిస్తూ ఎన్నికల బరిలోనిలపడానికి శ్రీకారం చుట్టాయి. పార్టీ గుర్తులతో నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో తమ బలాన్ని నిరూపించుకునేందుకు అధికార కాంగ్రెస్ నేతలు ము మ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోనిమున్సిపాలిటీలో విజ యం సాధించే బాధ్యతను జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీ, ఎమ్మెల్యే లు తలకెత్తుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మున్సిపల్ ఎన్నికలు సెమీఫైనల్ ఎన్నికలుగాపేర్కొనడంతో ఆ పార్టీ కూడా మున్సిపల్ ఎన్నికల విజయానికి తీవ్రంగా కసరత్తు ప్రారంభించింది.ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికల్లో ధన బలం ఉన్నవారికి మళ్ళీ ఆయా పార్టీలు టిక్కెట్లు కేటాయించే పరిస్థితి కనిపిస్తుందనిసామా న్య నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. తాము టికెట్ల కోసం పెద్ద నేతలను కలిస్తే ఏ మాత్రం డబ్బులు ఉన్నాయేమిటి అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తు న్నారని కొందరు గల్లి స్థాయి నాయకులు ఆవేదనవెళ్లగక్కుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిల ర్ పదవికి కూడా తాము కొరగామా అం టూ ప్రశ్నిస్తున్నారు.

## ఎమ్మెల్యే అక్బరుద్దీన్ పై పిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీ వాణి కేసు పెట్టారు. 15 నిమిషాలు అనే వ్యాఖ్యను ఉపయోగించి హిందువులను పదే పదే బెదిరిస్తున్నందుకు అక్బరుద్దీన్ ఒవైసీపై పోలీసు కేసు నమోదు అయిందిమహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో ఇటీవల జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ఈ రెచ్చగొట్టే మరియు బెదిరింపు ప్రకటన చేశారు. ఇటువంటి ద్వేషపూరిత ప్రసంగాలు ప్రమాదకరమైనవి, రాజ్యాంగ విరుద్ధమైనవి మరియు మత సామరస్యాన్ని దెబ్బతీసే లక్ష్యంతో ఉన్నాయి అంటూ ఆకుల శ్రీవాణి అన్నారు.
హిందువులపై ఇటువంటి బెదిరింపులు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు అతనిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## బోరబండలో దారుణ హత్య..

**భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త**



**హైదరాబాద్ పెన్ పవర్:**బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్లో సోమవారం అర్ధరాత్రి దారుణ హత్య . నిద్రిస్తున్న భార్యను భర్త రోకలి బండతో తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల కథనం ప్రకారం.. రాజీవ్ గాంధీ నగర్కు చెందిన రొడ్డె సరస్వతి (32), గృహిణి, భర్త రొడ్డె అంజనేయులు (43)తో కలిసి నివాసం ఉంటోంది. అంజనేయులు భార్యపై పరాయి సంబంధం ఉందని అనుమానిస్తూ తరచూ గొడవ పడేవాడని సమాచారం.పరారీలో ఉన్న భర్త.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీజీస్సీ స్టడీ సర్కిల్ ఉచిత ఉద్యోగ శిక్షణ కరపత్రం ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థుల కోసం టీజీస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే మరియు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలకు సంబంధించిన 5 నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం కరపత్రాన్ని మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఈ. ఇందిర పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ స్టడీ సర్కిల్, వరంగల్ నందు ఫిబ్రవరి 20 నుండి జులై 19 వరకు నిర్వహించనున్న ఈ ఉచిత శిక్షణకు సంబంధించి ప్రవేశాల కోసం ప్రిలిమినరీ ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, వారి వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని పేర్కొన్నారు.
అర్హులైన అభ్యర్థులు ఎష్ఎ్.ంర్బఎఎఎఆతీఎశ్రీవ.ఎశీ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా జనవరి 30 లోపు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 08 న ఎంపిక పరీక్ష నిర్వహించ బడుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు యస్సీ స్టడీ సర్కిల్, వరంగల్ నందు ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం మరియు స్టడీ మెటీరియల్ అందించబడుతుందని వివరించారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విలువైన అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## పారిశుద్ధ కార్మికులకు స్వెటర్లు పంపిణీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ నారెడ్ కో సంస్థ అధ్యక్షులు మేక విజయ్ సాయి ఆధ్వర్యంలో అంబర్ పేటలో పని చేస్తున్న జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు అంబర్ పేట ప్లే గ్రౌండ్ లో ఎమ్మెల్సీ కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్లు, జిహెచ్ఎంసి, పోలీసు అధికారులు కలిసి స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి లో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు పండుగ, ఆదివారం వేళలో డ్యూటీ సమయాన్ని తగ్గించి వారికి చేయూతనివ్వాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్య కార్మికులకే కాకుండా ఇక్కడ నివసించే ప్రాంత వాసులకు డబుల్ బెడ్ రూమ్ కొరకు 70 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే అందరికీ డబుల్ బెడ్ రూమ్ లను నిర్మించి ఇస్తామని అన్నారు. అంతేకాకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో జిహెచ్ఎంసి కార్మికులకు మూడుసార్లు జీతాలు పెరిగాయని గుర్తు చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు గడిచిన కూడా ఒక్కసారి కూడా జీతాలు పెంచిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు.
రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రారంభ కార్యక్రమాలు చేస్తున్నాము అని చెప్పడమే తప్ప ఇప్పటివరకు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. జిహెచ్ఎంసి ఎన్నికలలో ఈ సారి ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మరో మారు బిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## మేడారం జాతరకు నిమిషానికి 4 బస్సులు.. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు..

-3 పేజి తరువాయి
ఒకేసారి వెయ్యి బస్సులు పార్కింగ్ చేసేలా వసతులు కల్పించినట్టు చెప్పారు. 7వేల మంది డ్రైవర్లు, 18 వందల మంది కం డక్టర్లు పనిచేస్తారని వివరించారు.

## మడికొండ సీఐకి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు

**పరకాల, జనవరి 20 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సీఐ పుల్యాల కిషన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయనను మడికొండ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కలిసి పూల మొక్క ఇచ్చి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఎల్ఐసి ప్రభాకర్, బిల్లా రవీందర్, బైరి లింగమూర్తి, దువ్వ శ్రీకాంత్, కృష్ణారెడ్డి, దువ్వ నవీన్, కుమార్ బాబు తదితరులు సీఐ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## సాదీ భవాని మహా జాతర గోడ పత్రికల ఆవిష్కరణ

**నర్సంపేట, జనవరి 20 పెన్ పవర్:** మహబూబాబాద్‌లోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం సేవలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న నాయక్, బంజారాల ఆరాధ్య దైవం సాదీ భవాని మహా జాతర గోడ పత్రికలను ఆవిష్కరించారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరిగే ఈ వేడుకల్లో బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పాల్గొని, జాతరను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే ఈ జాతరలో భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**సంగారెడ్డి, జనవరి 20 పెన్ పవర్:** సంగారెడ్డి పట్టణంలో మంగళవారం రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కోటి రూపాయల విలువైన పరికరాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో రూ.28.70 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

**నారాయణఖేడ్, జనవరి 20 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలో హెచ్ఎండీఏ నిధులతో రూ.8 కోట్ల వ్యయంతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు, సీడీఎంఏ నిధులతో రాజీవ్ పార్క్ సుందరీకరణ పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పథకం కింద రూ.18.70 కోట్లతో రోడ్లు, మురుగు కాలువలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. హెచ్ఎండీఏ నిధులతో రూ.2 కోట్ల వ్యయంతో రాజంపేటచౌరస్తా నుండి ఫిల్టర్ బెడ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ఫిల్టర్ బెడ్ మరమ్మత్తుల పనులకు కూడా మంత్రి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ముందు ధర్నా

**జహీరాబాద్, జనవరి 20 పెన్ పవర్:** సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం విజయభాస్కర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, రీజినల్ అధ్యక్షుడు పీరయ్య, రీజినల్ చైర్మన్ పిఎస్ నారాయణ, కార్యదర్శి బి కే మూర్తి, డిపో అధ్యక్షుడు జానిమియా, డిపో కార్యదర్శి నాగేశ్వర్ పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని వారు కోరారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ: మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ఆందోల్, జనవరి 20 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించబడుతుంది.

## బిల్డింగ్ అడ్డుగా ఉందని 35 ఏళ్ల వేపచెట్టు నరికివేత



**మక్తల్, జనవరి 20 పెన్ పవర్:**నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్ లో దాదాపు 35 ఏళ్ల వయసున్న వేపచెట్టును కొందరు నరికివేశారు. నూతనంగా నిర్మించిన తన బిల్డింగ్ కు అడ్డుగా ఉందని బిల్డింగ్ యజమాని ఆ చెట్టును నరికివేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్లు తమకు తెలియదని, పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్ శాఖ సిబ్బంది మాత్రం స్పందించడానికి అందుబాటులో లేరు.

## కరెంట్ షాక్‌తో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి మృతి

**నాగర్‌కర్నూల్, జనవరి 20 పెన్ పవర్:** మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ షాక్‌తో 9వ తరగతి విద్యార్థి లోకేష్ (14) మృతి చెందాడు. పాఠశాలలో ఆటల పోటీలు జరుగుతుండగా, విద్యుత్ స్తంభం వద్ద ఉన్న వైర్ తగిలి విద్యార్థి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అతన్ని జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మృతిని నిర్ధారించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు: ఉచిత న్యాయ సేవలు, హక్కులపై అవగాహన

**నారాయణపేట, జనవరి 20 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలం వల్లంపల్లి గ్రామంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో, భారత రాజ్యాంగం పౌరులకు ఉచిత న్యాయవాదిని నియమించుకునే అవకాశం, క్రిమినల్ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం వంటి సేవలను అందిస్తుందని వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చని, వికలాంగులకు ఉపాధి అవకాశాలపై సమాచారం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాథమిక హక్కులు, విధులు, వినియోగదారుల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, వృద్ధుల

# వాటాలనుంచి డైవర్షన్ కోసమే మాకు నోటీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ రెడ్డి.. నీ కుంభకోణాలు, నీ వాటాల పంచాయతీలు ప్రజలకు అర్థం అవుతుందని డైవర్షన్ కోసం మాకు నోటీసులు ఇస్తునావని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఎన్నికలు ఉన్నప్పుడు మా పార్టీ నాయకులకు నోటీసులు ఇస్తావు. పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మా కేటీఆర్ కి నోటీసులు ఇచ్చావు, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయని నాకు నోటీసులు ఇచ్చావని అన్నారు.

గతంలో నువ్వు నా మీద ఫోన్ ట్యాపింగ్ కేసు పెడితే హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టేశాయి. నీ చెంప చెల్లుమనే లాగా తీర్పు ఇచ్చాయి. అయినా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏదో ఉందని రెండేళ్ల నుండి డ్రామా ఆడుతున్నావు . సుప్రీంకోర్టు కొట్టేసిన తర్వాత కూడా నీ డ్రామాలు ఏందని అన్నారు.

నువ్వు ఎన్ని డ్రామాలు చేసినా నిన్ను వదిలేది లేదు.. నీ కుంభకోణాల గురించి నిలదీస్తూనే ఉంటాం. కిషన్ రెడ్డికి నేను బహిరంగ లేఖ రాస్తున్నాను. కిషన్ రెడ్డి నువ్వే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్నావు. నువ్వు రేవంత్ రెడ్డితో కుమ్మక్కు కాకపోతే, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించు. సింగరేణి టెండర్ల విషయంలో రేవంత్ రెడ్డి బావమరిది చేసిన అక్రమాలు అన్నిటికి నేను ఆధారాలు ఇస్తానని అన్నారు. వెంటనే కిషన్ రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కుల అందజేత

**సికింద్రాబాద్: పెన్ పవర్:**నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండలం లోని 62 కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంగళవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుమలగిరి తహసీల్దార్ బిక్షపతి గారితో కలిసి అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడుతూ పేదింటి కుటుంబాలు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి అప్పుల పాలు కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా వివాహం చేసిన ప్రతి పేద కుటుంబానికి 1,00,116/- లను అందజేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మరింత త్వరగా మంజూరు అవుతున్నాయని, ప్రజలు ఇది గమనించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం అందజేసి పేద ప్రజల ఇళ్లల్లో ప్రతిరోజు పండుగ జరిగేలా కృషి చేస్తుందని చెప్పారు.

## యాదాద్రి లో మంత్రి కోమటిరెడ్డి పూజలు



**యాదాద్రి: పెన్ పవర్:**రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ తో కలిసి స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక, ఆశీర్వచనాలు వేద పండితులు అందచేసారు. అంతకు ముందు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు స్వాగతం పలికారు.

## లింగగూడెం గ్రామ సర్పంచ్ రికౌంటింగ్ వాయిదా

**ఖమ్మం, పెన్ పవర్:**ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సమక్షంలో జరగాల్సిన పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామ సర్పంచ్ రీ కౌంటింగ్ ఈ నెల 27 కు వాయిదా పడింది.కోర్టు ఇచ్చిన ఇంట్రిమ్ ఆర్డర్ తో సంబంధిత అధికారులు పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక బ్యాలెట్ పేపర్లను కోర్టు కి అప్పగించడంతో సర్పంచ్ ఎన్నిక ఓట్ల రీ కౌంటింగ్ నిన్న జరగాల్సి ఉండగా ప్రభుత్వం తరఫున ఏజిపి కొంత సమయం కావాలని కోరటంతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి ఎస్ ఎన్ సుమ బాల ఈ నెల 27 వ తారీఖు కు వాయిదా వేయడం తో ఉత్కంఠంగా ఎదురు చూసిన సర్పంచ్ ఎన్నిక రీ కౌంటింగ్ వాయిదా పడింది

## మేడారం జాతర లో ప్లాస్టిక్ ను వాడకండి:




**నర్సంపేట, జనవరి 20 పెన్ పవర్:** మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో, ఏ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే మాధవరెడ్డి 'ప్లాస్టిక్ వాడకండి. మేడారం ను రక్షించండి' అనే వాల్ పోస్టర్ ను ప్రారంభించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే మేడారం జాతరలో ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా, మీ ఆరోగ్యాన్ని రక్షించుకుంటూ గాలి, నీరు, భూమిని కలుషితం చేయకుండా పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందని ఆయన అన్నారు.

## తీవ్ర విషాదం.. మహిళ ప్రాణం తీసిన కరెంట్

**వరంగల్ వెస్ట్, జనవరి 20 పెన్ పవర్:** విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామానికి చెందిన జటంకి నీలమ్మ(30) వంట చేస్తుంది. ఆ సమయంలో పక్కనే ఉన్న వంట సామగ్రిని ఉంచే స్టాండుకు విద్యుత్ సరఫరా అయింది. అది తెలియక దానిని తాకడంతో షాక్ తగిలి కిందపడిపోయింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. నీలమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు

## నిరుద్యోగుల పోరు దీక్ష:

**కళాకారుల ఆటపాటలతో సభా ప్రాంగణం ఉర్రూతలు**

**వర్ధన్నపేట, జనవరి 20 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారులు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పోరు దీక్ష శిబిరంలో తమ ఆటపాటలు, డప్పు విన్యాసాలు, కోలాటాలు, ఉద్యమ పాటలతో సభా ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెన్నమల్ల వెంకటేష్, బుల్లెట్ వెంకన్న, పాలిటి రాజు, నాగుల సుధాకర్, భాస్కర్, గడ్డం సుధాకర్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

# కవిత పార్టీ కోసం .. రంగంలోకి ప్రశాంత్



**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకత్వంతో విభేదాలు, అనంతర బహిష్కరణ పరిణామాల తర్వాత కల్వకుంట్ల కవిత తన రాజకీయ అస్తిత్వం కోసం సొంతగూడు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఉగాది పర్వదినాన కొత్త పార్టీని ప్రకటించే దిశగా శరవేగంగా అడుగులు పడుతుండటం, దానికి జాతీయ స్థాయి వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెరవెనుక సహకారం అందిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.కవితకు మొదటి నుంచీ 'తెలంగాణ జాగృతి' అనే బలమైన సాంస్కృతిక వేదిక ఉంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడం ద్వారా ఆమె ప్రజల్లోకివెళ్లారు. ఇప్పుడు అదే జాగృతిని రాజకీయ పార్టీగా మార్చాలని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉన్న కేడర్, జిల్లాల వారీగా ఉన్న నెట్‌వర్క్ ఆమెకు కలిసివచ్చే అంశం. ఎమ్మెల్సీగా వీడ్కోలు చెబుతూ ఆమెచేసిన వ్యాఖ్యలు, తాను ఒంటరిని కాదని, ప్రజల అండతో కొత్త ప్రస్థానం మొదలుపెడతానని స్పష్టం చేశాయి.ఈ మొత్తం ఎపిసోడ్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం ప్రశాంత్ కిశోర్ ప్రమేయం. గతంలో వైఎస్ జగన్,మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి నేతలకు అధికారాన్ని అందించిన ట్రాక్ రికార్డ్ పీకేకు ఉంది. కవితతో ఆయన వరుస భేటీలు జరిపారన్న వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతంబీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల పట్ల ఉన్న అసంతృప్తిని కవితకు అనుకూలంగా ఎలా మలచాలో పీకే విశ్లేషించగలరు. కవితను కేవలం ఒక మాజీ నేతగా కాకుండా, ఒక బాధితురాలిగా లేదా ప్రత్యామ్నాయ శక్తిగా జనాల్లోకితీసుకెళ్లే వ్యూహాన్ని ఆయన రచించవచ్చు.అయితే, ఇటీవల బీహార్‌లో సొంతంగా పార్టీ పెట్టిన ప్రశాంత్ కిశోర్ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారు. గ్రౌండ్ రియాలిటీకి, వ్యూహాలకు మధ్య ఉన్న వ్యత్యాసం అక్కడ బయటపడింది.బయట రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. చాలా కాలంగా తన సొంత పార్టీ జన సురాజ్ కార్యకలాపాలకే పరిమితమైన పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిశోర్ తనంతట తానుగా ఆ మధ్య కవితకు ఫోన్‌చేశారంట. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇబ్బందికర పరిస్థితి నుంచి బయటకు వచ్చిన కేసీఆర్ కుమార్తెకు సాయం చేస్తానని తానే ఆఫర్ చేశారంట. రాజకీయ పార్టీలకు వ్యూహాలను అందించే ఐప్యాక్‌ను స్థాపించి నడిపించినప్రశాంత్ కిషోర్ దేశంలో చాలా రాజకీయ పార్టీలకు సేవలందించారు. ఆ తర్వాత ఐప్యాక్ నుంచి బయటకువెళ్లి సొంత రాష్ట్రం బిహార్‌లో రాజకీయ పార్టీని నిర్మించుకున్నారు. ఐప్యాక్ నుంచి బయటకెళ్లాక పార్టీలుఅడిగితే పర్సనల్‌గా సాయం చేయడమే తప్ప.. ప్రొఫెషనల్‌గా పనిచేయని ప్రశాంత్ కిషోర్ తనంతట తాను కవితకు సాయం చేస్తానని చెప్పడమే విశేషం. కవిత బీఆర్ఎస్ ను వీడినప్పటి నుంచి ఇప్పటివరకూ వీరిద్దరిమధ్య నాలుగైదు సార్లు చర్చలు జరిగాయి. కవితను కలవడం కోసం ప్రశాంత్ కిషోరే స్వయంగా హైదరాబాద్ వచ్చారు. "ప్రశాంత్ కిషోర్ తో చాలా కాలంగా చర్చలు నడుస్తున్నాయి. ఆయనంతట ఆయనే మాతో కలుస్తామని ప్రపోజల్ పెట్టారు. అక్టోబర్ –నవంబర్ లో కొన్ని సమావేశాలు జరిగాయి. డిసెంబర్‌లో కూడా హైదరాబాద్ వచ్చారు. ఈ సంక్రాంతికి ముందు నాలుగు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నారు. అప్పుడు ప్రతిరోజూకవిత– ఆయన చర్చలు జరిపారు" అని ఆ పార్టీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ,ఈ భేటీల్లో పార్టీ నిర్మాణం, ప్రజల్లోకి వెళ్లే విధానం , పార్టీ సిద్ధాంతాలపై లోతైన కసరత్తు జరిగినట్లు సమాచారం. "తెలంగాణ ప్రజల కోసం..ప్రజల భాగస్వామ్యంతో" అనే నినాదంతో ఈ పార్టీ ఉండాలని కవిత భావిస్తున్నట్లు సమాచారం. ప్రశాంత్ కిశోర్‌తో కవితకు బీఆర్ఎస్ లో ఉన్నప్పటి నుంచే సన్నిహిత సంబంధాలున్నాయి. అప్పట్లో ఆ పార్టీ కోసం ప్రశాంత్‌కిషోర్ పనిచేశారు. ఆ సందర్భంగా కవితతో కలిసి పని చేశారు. ఆ సాన్నిహిత్యం ద్వారానే ఇప్పుడు తనంతట తానుగా తెలంగాణలో కవితకు సహకారం అందించేందుకు ఆయన ముందుకొచ్చారు. పార్టీ ప్రకటనకు ముందేపక్కా ప్రణాళికతో కవిత ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 50 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు, ఆకాంక్షలు , సమస్యలపై లోతైన అధ్యయనంచేస్తున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగానే పార్టీ విధానాలను రూపొందించాలని కవిత నిర్ణయించుకున్నారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుతూనే, ప్రజా కేంద్రీకృత పాలనను అందించడమే ఈ కొత్త పార్టీప్రధాన ఎజెండాగా ఉండబోతోందని తెలుస్తోంది.ప్రశాంత్ కిషోర్‌తో చర్చలు తుది దశకు చేరుకున్నాయని, పార్టీ పేరు , లోగోపై కూడా ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం అందుతోంది. అయితే, ఈ పరిణామాలపై అటు కవిత నుంచి కానీ, ఇటు ప్రశాంత్ కిషోర్ నుంచి కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయినప్పటికీ, కమిటీల ఏర్పాటు, పీకేతో వరుస భేటీలు చూస్తుంటే, తెలంగాణలోత్వరలోనే ఒక కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం తెరపైకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ వంటి ఉద్వేగభరిత రాష్ట్రంలో పీకే వ్యూహాలు కవితను ఏ మేరకు గట్టెక్కిస్తాయనేది ప్రశ్నార్థకమే.కవిత తనకొత్త పార్టీ ద్వారా ప్రధానంగా బీఆర్ఎస్ ఓటు బ్యాంకును, ముఖ్యంగా అసంతృప్త నేతలను టార్గెట్ చేసే అవకాశం ఉంది. పార్టీ నుండి బహిష్కరణకు గురైన తర్వాత ఆమెలో పెరిగిన కసి, గత కొన్ని రోజులుగా ఆమె చేస్తున్నవిమర్శలు గమనిస్తే.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ను దెబ్బతీయడమే ఆమె తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే, సొంత తండ్రి కట్టిన కోటపైనే ఆమె తిరుగుబాటు బావుటాఎగురవేయబోతున్నారు.కవిత ముందున్న మార్గం అంత సులభమేమీ కాదు. తెలంగాణలో ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలు బలంగా ఉన్నాయి. ఇలాంటి త్రిముఖ పోటీలో నాలుగో శక్తిగా ఎదగాలంటే బలమైన ఎజెండాఉండాలి. కేవలం 'రెంజ్ పాలిటిక్స్' తో పార్టీని నడపడం అసాధ్యం. కవిత పోరాటం కేవలం మనుగడ కోసమా? లేక తెలంగాణ రాజకీయాల్లో కింగ్ మేకర్ కావడానికా? అన్నది ఉగాది నాటి ప్రకటనతోస్పష్టమవుతుంది. ప్రశాంత్ కిశోర్ మేధస్సు, కవితకున్న వాగ్ధాటి తోడైతే తెలంగాణలో కొత్త సమీకరణాలు పుట్టుకురావడం ఖాయం. అయితే, ప్రజలు ఆమెను ఒక స్వతంత్ర శక్తిగా అంగీకరిస్తారా లేదా అనేది కాలమేనిర్ణయించాలి.

# ఆధునికత తో పాటు సంప్రదాయం...

**వరంగల్, జనవరి 20, పెన్ పవర్:**
మేడారం జాతర తెలంగాణలో ములుగు జిల్లాలో ఓ చిన్న గ్రామమైన మేడారంలో రెండేళ్లకోసారి జరిగే భారీ గిరిజన ఉత్సవం. సమ్మక్క, సారలమ్మ అనే ఇద్దరు దేవతలను పూజించే వేడుక. ఈ దేవతలు గిరిజనులకుధైర్యం, రక్షణ, ప్రకృతికి సంబంధించిన చిహ్నాలుగా పూజలందుకుంటున్నారు. ఈ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందింది. కేవలం గిరిజనులు, తెలంగాణవాసులు మాత్రమే కాదు చుట్టుపక్కలరాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు

**తొలినాళ్లలో జాతర ఎలా జరిగేది?**

జాతర మూలాలు 13వ శతాబ్ధంలో కాకతీయుల కాలానికి చెందినవి. గిరిజన నాయకులు అడవిలో వేటాడుతుండగా ఓ శిశువు (సమ్మక్క) చుట్టూ పులులు రక్షణగా నిలిచి కనిపించాయి. ఈ చిన్నారిని తీసుకెళ్లి పెంచారుగిరిజనులు,ఆ చిన్నారి పెరిగి పెద్దైన తర్వాత పగిడిద్దరాజును వివాహం చేసుకుంది. వారికి సారలమ్మ (సారక్క), నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం. కాకతీయరుద్రుడు కరువు కాలంలో గిరిజనులపై పన్నులుఆంక్షలు విధించాడు. దీనికి వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ నాయకత్వంలో గిరిజనులు తిరుగుబాటు చేశారు. ఆ యుద్ధంలో జంపన్న సంపెంగవాగులో దూకి మరణించాడు..అప్పటి నుంచి ఆ వాగును జంపన్నవాగుగా పిలుస్తున్నారు. సమ్మక్క సారలమ్మ అడవిలో మాయమయ్యారు. అక్కడ కుకుమ భరిణె కనిపించింది. వారి ధైర్యసాహసాలు గిరిజనుల్లో ఆరాధనా భావాన్ని పెంచాయి. కొన్ని కథల్లో ఇది యుద్ధంకాకుండా ప్రకృతిరక్షణ, ఆధ్యాత్మిక శక్తులకు సంబంధించినదిగా చెబుతారు. ఆరంభంలో ఈ ఉత్సవం గిరిజనులకు మాత్రమే పరిమితమై ఉండేది. 1930కి ముందు బక్కయ్యపేట అనే గ్రామంలో చిన్న చిన్న సమావేశాలుగా జరిగేది.

కరువు, స్థలం కొరత కారణంగా ఈ సమావేశాలు 1935లో మేడారానికి మార్చారు ఆ తర్వాత గిరిజనులుతో పాటూ ఇతర సమాజాల వారు కూడా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు1990లో ప్రభుత్వం నుంచి జాతరకు గుర్తింపు లభించింది2012లో మేడారం జాతరు కోటిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారుఇప్పుడు దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణగా మారిన మేడారం జాతరను తెలంగాణ కుంభమేళా అని పిలుస్తున్నారుగిరిజన యువత ఈ సంస్కృతిని కాపాడుకుంటూ వేడుక జరుపుకుంటున్నారు.హిందువుల ఆచారాలతో మిళితమై ఉన్నా గిరిజన మూలాన్ని కాపాడుకుంటూ జాతర నిర్వహిస్తున్నారుమేడారం జాతర ఆరంభంలో కేవలం కోయ గిరిజనులు మాత్రమే పాల్గొనేవారు. అడవీ ప్రాంతంలో అతి కొద్దిమందిసందడి మధ్య జాతర సాగేది. సమ్మక్క సారలమ్మను పూజించేందుకు చెట్టు కింద గద్దెలు ఏర్పాటు చేసి పూజించేవారు. సమ్మక్క–సారలమ్మ వీరత్వాన్ని కథల రూపంలో చెప్పుకునేవారు. బెల్లం, కొబ్బరి, జంతుబలులునివేదించేవారు. ఆటపాటలు, గిరిజన నృత్యాలతో ఆనందంగా జరిగేది జాతర. రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఎడ్ల బండ్లు కట్టించుకుని వచ్చేవారు. జనవరి ఆఖర్లో లేదంటే ఫిబ్రవరిలో జరుగుతుంటుంది మేడారంజాతర. భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రోడ్లు, నీరు, విద్యుత్, హెలిప్యాడ్లు, బస్ స్టాండ్లు, భద్రత సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. దేవతలను అడవి నుంచి గద్దెలపైకి తీసుకురావడంప్రధాన ఆచారం. ఇందుకోసం కోయబాలుడు ఉపవాసం ఉండి కుంకుమ భరిణె వెతికి గద్దెలపైకి తీసుకొస్తారు. భక్తులు బంగారం ( బెల్లం) తమ బరువుకు సమానంగా నైవేద్యంగా సమర్పిస్తారు. జంపన్నవాగులోస్నానమాచరిస్తే ధైర్యం పెరుగుతుందని భక్తుల నమ్మకం. జాతర నాలుగు రోజులు ఇసుకేస్తే రాలనంతమంది భక్తులతో నిండిపోతుంది ఆ ప్రాంగణం. గిరిజన సంస్కృతిని, చరిత్రను ప్రతిబింబించే ఈ జాతర ఆధునికతమిళితమైనా ఆత్మను కోల్పోకుండా వైభవంగా జరుగుతోంది.

# రైతులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ వస్తోంది. దీనిలో భాగంగానే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తుండగా.. ఇటీవల సబ్సిడీపై యంత్రాలను కొనుగోలు చేసే విధంగా మరో పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై కొనుగోలు చేసేందుకు వీలు ఉంటుంది. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండల వ్యవసాయ శాఖ ద్వారా పలు యంత్రాలను సబ్సిడీలో విక్రయించేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు.తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని ముమ్మరంగా అమలు చేస్తోంది. సాగు పనుల్లో కూలీల కొరతను అధిగమించడంతో పాటు.. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పనులు పూర్తి చేసేందుకు వీలుగా రైతులకు భారీ సబ్సిడీలను అందిస్తోంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండల వ్యవసాయ శాఖ ద్వారా అర్హులైన రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుత విడతలో ప్రభుత్వం ప్రధానంగా రోటోవేటర్లు, స్ప్రేయర్లపై సబ్సిడీని ప్రకటిస్తోంది. రైతులపై ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో వీటిపై రాయితీలు కల్పిస్తున్నారు.రోటోవేటర్.. పొలం దున్నడానికి ఉపయోగపడే రోటోవేటర్ కొనుగోలుపై 50,000 రూపాయల వరకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. దీనిపై దాదాపు 50 శాతం వరకు రాయితీ కల్పిస్తారు. పురుగుల మందుల పిచికారీ కోసం ఉపయోగించే ఆధునిక హోండా కంపెనీ స్ప్రేయర్లపై 10,000 రూపాయల రాయితీ లభిస్తుంది. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకునే రైతులు కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సాగు భూమి కనీసం ఒక ఎకరం అంతకంటే ఎక్కువ కలిగి ఉండాలి. రోటోవేటర్ కోసం దరఖాస్తు చేసే రైతులకు సొంతంగా ట్రాక్టర్ ఉండాలి. ఆ



ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ పత్రం తప్పనిసరిగా రైతు పేరు మీద లేదా భార్య/భర్త పేరు మీద ఉండాలి.ట్రాక్టర్ ఆర్సీ కేవలం వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే నమోదై ఉండాలి. కమర్షియల్ లేదా రవాణా విభాగంలో నమోదైన ట్రాక్టర్లకు ఈ రాయితీ వర్తించదు. ఆసక్తి గల రైతులు నిర్ణీత గడువులోగా పత్రాలను మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. పట్టాదారు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (రోటోవేటర్ దరఖాస్తుదారులకు మాత్రమే), బ్యాంక్ ఖాతా వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొల్లాపూర్ మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్ కోరారుదరఖాస్తులు సమర్పించడానికి జనవరి 24వ తేదీని గడువుగా నిర్ణయించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు కాబట్టి.. రైతులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ పేర్కొంటోంది. భవిష్యత్తులో మరిన్ని పరికరాలను కూడా ఈ రాయితీ జాబితాలో చేర్చే యోచనలో ప్రభుత్వం ఉంది.

# ఆన్ లైన్ కే గులాబీ పరిమితమా

**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య క్షేత్రస్థాయి పోరాటం విషయంలో స్పష్టమైన వ్యత్యాసంకనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటికే ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టగా, బీఆర్ఎస్ మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది.నెల రోజుల క్రితంబీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, పదిహేను రోజుల్లో మూడు జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని అందరూ భావించారు.కానీ, ఆ గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా, ఆ సభల ఊసే ఎత్తకపోవడం పార్టీ క్యాడర్‌కూ ఇబ్బందికరంగానే మారింది. కేసీఆర్ ప్రకటన తర్వాత క్షేత్రస్థాయిలో ఎలాంటి కదలిక లేకపోవడంతో, ద్వితీయ శ్రేణినాయకత్వం , కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై రోడ్డెక్కి పోరాడాల్సిన సమయంలో, కేసీఆర్ మౌనం దాల్చడం బీఆర్ఎస్ వ్యూహకర్తలను కూడా ఆలోచనలో పడేస్తోంది.ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి రాజకీయ కార్యాచరణలో అత్యంత చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాల పర్యటనలు ప్రారంభించిన ఆయన, వచ్చే నెలలో తొమ్మిది జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు సిద్ధం చేశారు.పాలమూరులో ట్రిపుల్ ఐటీ శంకుస్థాపన, మేడారంలో కేబినెట్ భేటీ వంటి నిర్ణయాల ద్వారా పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్తూనే, రాజకీయంగా కూడా మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగాక్షేత్రస్థాయిలో పర్యటిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయి ఎన్నికల మోడ్‌లోకి వెళ్లిపోయాయి.బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం సోషల్ మీడియా విమర్శలు, ప్రెస్ మీట్లు , ట్విట్టర్ వేదికగా చేసే ఆరోపణలకే పరిమితంఅవుతోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి నేతలు నిత్యం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నప్పటికీ, అది కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల సామాన్య




ఓటరుపై దాని ప్రభావం తక్కువగా ఉంటోంది. రాజకీయాల్లో కంటికి కనిపిస్తేనే ఓటు అనే సూత్రం బలంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి జనంలోకి వెళ్తుండగా, బీఆర్ఎస్ నేతలు ఇళ్లకే పరిమితమవ్వడం ఆ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో చేటు తెచ్చే ప్రమాదం ఉంది.మున్సిపల్ ఎన్నికలు అనేవి స్థానిక సమస్యలు, నేరుగా ఓటరుతో ముడిపడి ఉన్నవి. ఇక్కడ భావోద్వేగాల కంటే నాయకుల చురుకుదనం ముఖ్యం. రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోవాలంటే బీఆర్ఎస్ కేవలం ఆరోపణలతో సరిపెట్టకుండా,కేసీఆర్ చెప్పినట్లుగా బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార యంత్రాంగం , సంక్షేమ పథకాల జోరుతో దూసుకుపోతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం గులాబీ దళానికి కత్తిమీద సామే అవుతుంది. ప్రకటనలకు.. ఆచరణకు మధ్య ఉన్న ఈ అంతరం బీఆర్ఎస్ ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం ఉంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల వేటనుప్రారంభించిన తరుణంలో, బీఆర్ఎస్ ఇంకా సభల ముహూర్తాల కోసమే ఎదురుచూస్తుండటం ఆ పార్టీ బలహీనతను సూచిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు బీఆర్ఎస్ తన పంథాను మార్చుకోకపోతే, పట్టణ ఓటర్లుఅధికార పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# జియోట్యాగింగ్‌తో తప్పిపోయిన వారి చెక్

**వరంగల్, జనవరి 20, పెన్ పవర్:** దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి సరికొత్త సాంకేతిక సొబగులను అద్దుకుంటోంది. ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహా జాతర కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ముందెన్నడూ లేని విధంగా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నాయి. భద్రతా ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, జాతర ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.జాతరలో భద్రతను పర్యవేక్షించేందుకు 'మేడారం 2.0'లో భాగంగా 'టీజీ-క్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దాదాపు 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీగా ఉండే రహదారులపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంచుతాయి. కేవలం డ్రోన్లే కాకుండా.. ఆకాశంలో ఎగిరే హీలియం బెలూన్లకు పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలనుఅమర్చారు. ఇవి అత్యంత ఎత్తు నుంచి కూడా రద్దీని విశ్లేషించి, తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈఅత్యాధునిక నిఘా నీడలో విధులు నిర్వహించనున్నారు.గత జాతరలో సుమారు 30 వేల మంది వరకు తప్పిపోయిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి వొడాఫోన్-ఐడియా సహకారంతో 'జియోట్యాగ్‌బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను సిద్ధం చేశారు. పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ కలిగిన జియోట్యాగ్‌లను కడతారు. ఒకవేళ ఎవరైనాతప్పిపోతే, ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి పూర్తి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని



ఇప్పుడు మేడారంలో అమలు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్‌తో పాటుహిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.జాతరలో శాంతిభద్రతల కోసం 12 ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద ముఖ గుర్తింపుసాంకేతికత ద్వారా పాత నేరస్థులను ఇట్టే పసిగట్టవచ్చు. అలాగే అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం 2,000 ఎకరాల్లో 37 పార్కింగ్‌ప్రదేశాలు, 50కి పైగా అనౌన్స్‌మెంట్ పాయింట్లు అందుబాటులో ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ గద్దెల ప్రాంగణాన్ని పునఃప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలనుదర్శించుకున్న సీఎం.. తన మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వనదేవతల దర్శనం ప్రశాంతంగా సాగేలా చూడాలనిఅధికారులను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదం.. కెనాల్ లో బోల్తాపడ్డ క్వాలిస్ వాహనం

**కోరుట్ల, జనవరి 20 పెన్ పవర్:** కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్తుండగా జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ కళాశాల సమీపంలో క్వాలిస్ వాహనం కెనాల్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు, ఐదుగురు మహిళలతో సహా మొత్తం 12 మందికి గాయాలయ్యాయి. బ్రేకులు ఫెయిల్ అవ్వడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన గాయపడిన వారిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, కొండగట్టు ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## తల్లులకు బంగారం.. వ్యాపారులకు వరం

**మంథని, జనవరి 20 పెన్ పవర్:** భక్తుల కొంగు బంగారమైన సమ్మక్క-సారలమ్మ మహా జాతర కోలాహలం మొదలైంది. కోరిన కోరికలు తీర్చే తల్లులకు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) తులా భారం సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. జాతర సమీపిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో బెల్లం అమ్మకాలు ఊపందుకున్నాయి. వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గతంతో పోల్చితే ఈసారి భారీగా అమ్మకాలు పెరుగుతాయని వారు భావిస్తున్నారు. దీంతో ముందస్తుగా భారీగా ప్రస్తుతం నిల్వ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## మున్సిపల్ ఎన్నికల శిక్షణ: అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




**కొత్తగూడెం, జనవరి 20 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

## సీబీసీ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఇల్లందు, జనవరి 20 పెన్ పవర్:** ఇల్లందు సింగరేణి కాలనీలో వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సీబీసీ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం ప్రారంభించారు. స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం ప్రజలను ఏకం చేసి, ఉద్యమకారుల్లో ఉత్తేజాన్ని నింపిందని ఆయన అన్నారు. జాతీయ భావాన్ని చాటిచెప్పే ఇలాంటి ప్రదర్శనలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## బస్సు ప్రమాదం.. క్షతగాత్రులు వీరే!

**భద్రాచలం, జనవరి 20 పెన్ పవర్:** దమ్మపేట మండలం గట్టుగూడెం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో ధూళిపాల సోమయాజులు, కనక లక్ష్మి కుమారి, తేజశ్రీ, వేదశ్రీ, కందుల భాను, నిత్య రోషిని, డ్రైవర్ కాళ్ల శ్యాంప్రసాద్, క్లీనర్ కాసాని శ్రీను, మట్టా శ్రీనివాసరావు, మట్టా సుజాత, మట్టా జయదీప్, నాగులపల్లి ప్రశాంత్ కుమార్, దుగ్గిరాల గన్నమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుగుతోంది.

## బాలికపై లైంగికదాడికి యత్నం!

**అశ్వారావుపేట, జనవరి 20 పెన్ పవర్:** ముదిగొండ మండలంలో దారుణం జరిగింది. మాయమాటలతో బాలికను కిడ్నాప్ చేసిన గోపి అనే యువకుడు, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. అమ్మాయి కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశారు. నిందితుడిపై కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు ఫైల్ చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## భార్య హత్య కేసులో భర్తపై అనుమానం!..

**పినపాక, జనవరి 20 పెన్ పవర్:** ఖమ్మం రమణగుట్టలో శైలజ మరణంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనారోగ్యంతో మరణించిందని నమ్మించి భర్త సురేందర్ హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించగా, అనుమానం వచ్చిన మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ పర్యవేక్షణలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివాహేతర సంబంధం కోసమే ఇంజెక్షన్‌తో భార్యను హతమార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## మేడారం జాతరకు 4వేలకు పైగా ప్రత్యేక బస్సులు: టీజీఎస్ఆర్టీసీ ఎండీ

**వరంగల్ ఈస్ట్, జనవరి 20 పెన్ పవర్:** మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం 4వేలకు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మండలాల నుంచి మేడారం వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు కూడా సిద్ధంగా ఉంచామని, భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకుని సురక్షితంగా జాతరకు చేరుకోవాలని నాగిరెడ్డి కోరారు.

## కేసముద్రంలో లారీ ఓనర్ల ధర్నా

**మహబూబాబాద్, జనవరి 20 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో లారీ యజమానులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇనుగుర్తి ప్రధాన రహదారిపై లారీలను నిలిపివేసి నిరసన తెలపడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. 25 రోజులుగా ఆగిపోయిన 50 లారీల రవాణాను పునరుద్ధరించాలని, కేసముద్రం రైస్ మిల్లర్లు, మర్చంట్స్ ఆఫ్ కామర్స్ తమ పొట్ట కొడుతున్నారని, కమీషన్లు ఇవ్వకపోతే లారీలను లోడింగ్ కి పెట్టుకోవడం లేదని, తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని లారీ యజమానులు ఆరోపించారు.

## ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

**భద్రాద్రి కొత్తగుడెం పెన్ పవర్::** దమ్మపేట మండలం గట్టు గుడెం వద్ద కేవీఆర్ ట్రావెల్స్ కు చెందిన స్లీపర్ బస్సు బోల్తా పడింది. ఆ బస్సు నలభై మంది ప్రయాణీకుల తో రాజమండ్రి నుండి హైద్రాబాద్ కు వెళుతోంది. అశ్వారావుపేట దాటి ఇరవై కిలోమీటర్లు వెళ్లిన తర్వాత గట్టుగూడెం వద్ద బ్రేక్ ఫెయిల్ అవడంతో అదుపు తప్పి రోడ్డుపక్కన పొలాల్లోకి బోల్తా పడింది. బస్సులో 43 మంది ప్రయాణికులు ఉండగా 12 మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను పోలీస్ వాహనాల్లో, అంబులెన్సుల్లో హాస్పిటల్ కి తరలించారు.

## రిపబ్లిక్ డే గెస్టులు వీరే

**న్యూఢిల్లీ, జనవరి 20, పెన్ పవర్::** ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కర్తవ్య పథ్‌లో 77వ రిపబ్లిక్ డే వేడుకల పరేడ్ ప్రణాళికను రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న తర్వాత జనవరి 27న న్యూఢిల్లీలో జరిగే 16వ ఇండియా–ఈయూ సమ్మిట్‌లో వారు యూరోపియన్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. అక్కడ వారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుస్తారు. జుఖ ప్రకటన ప్రకారం.. ఈ శిఖరాగ్ర సమావేశం వాణిజ్యం, భద్రత, రక్షణ, స్వచ్ఛమైన పరివర్తన, ప్రజల మధ్య సంబంధాలపై సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తుంది.
గణతంత్ర వేడుకల్లో ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజ నాయకులు సహా వివిధ రంగాల నుండి సుమారు 10,000 మంది ప్రత్యేక అతిథులు పరేడ్‌ను వీక్షిస్తారని రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వివరించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర మంత్రిత్వ శాఖల నుండి మొత్తం 30 శకటాలు పాల్గొననున్నాయి. ఇవి స్వేచ్ఛ, స్వావలంబన ఇతివృత్తాలను ప్రదర్శిస్తాయి. తొలిసారిగా భారత సైన్యం యాంత్రిక, అశ్వికదళ స్తంభాలతో సహా దశలవారీ యుద్ధ శ్రేణి నిర్మాణాన్ని ప్రదర్శిస్తుంది, అయితే ఫ్లై–పాస్ట్‌లో ఫైటర్ జెట్‌లు, హెలికాప్టర్ల నిర్మాణాలు ఉంటాయి. దాదాపు 2,500 మంది సాంస్కృతిక కళాకారులు జాతీయ గర్వం, పురోగతి ఇతివృత్తాలపై ప్రదర్శనలు ఇస్తారు

## కొత్తపేటలో ఉచిత వైద్య శిబిరం

## ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ



**మంచిర్యాల, జనవరి 20 పెన్ పవర్:** జన్నారం మండలం కొత్తపేట గ్రామంలో ఈరోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు జ్వరం, బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మారుతున్న వాతావరణంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. సర్పంచ్ దినేష్ నాయక్, ఉపసర్పంచ్ సుకదేవి, ఓఒఊఖ మౌనిక, ఓఖఊం ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి భీమ్రావ్, ఆశా వర్కర్ సుజాత పాల్గొన్నారు. గ్రామస్తులు వైద్య శిబిరంపై సంతోషం వ్యక్తం చేశారు.

## రోడ్డు భద్రతపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అవగాహన

**బెల్లంపల్లి, జనవరి 20 పెన్ పవర్:** ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అరైవ్ ? అలైవ్ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం సేవించి నడపొద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూజారి కుమారుడికి కాంగ్రెస్ నాయకుడి చేయూత

**చెన్నూరు, జనవరి 20 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారక గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ ధాత్రేత్రయ స్వామి దేవాలయంలో పూజారిగా సేవలందిస్తున్న మధ్యప్రదేశ్ కు చెందిన అయ్యగారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పూజారికి, స్థానిక నూతన యువ ఉపాసర్పంచ్ కస్తూరి వెంకటేష్ హారిక స్పందించి, గ్రామ వాట్సాప్ గ్రూప్ లో సహాయం కోరారు. సభ్యులు స్పందించి రూ.34,000 సేకరించి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం త్రిమూర్తి చేతుల మీదుగా మంగళవారం పూజారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు పునఃప్రారంభం:

## గ్రామాభివృద్ధికి ఊతం

**ఆసిఫాబాద్, జనవరి 20 పెన్ పవర్:** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని డోడ్డీగూడ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులు పునఃప్రారంభమయ్యాయి. సర్పంచ్ మాడవి నాగోరావు, ఉపసర్పంచ్ దుర్గం భీంరావ్, ఫీల్డ్ అసిస్టెంట్ బాజీరావు, సీనియర్ మేటీలు మాడవి సోనేరావు, ఆత్రం అన్నారావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులు గ్రామంలో పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సౌకర్యాల అభివృద్ధి లక్ష్యంగా సాగుతాయి. ఈ పనులు గ్రామస్తులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ మాడవి నాగోరావు మాట్లాడుతూ, "ఉపాధి హామీ పనులు గ్రామంలో బలమైన అభివృద్ధికి, నీటి వనరుల పరిరక్షణకు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కీలకంగా నిలుస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం ద్వారా సామూహిక అభివృద్ధి సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు.

## భాజపాలోకి వార్డు నెంబర్ 3 నాయకులు

**సిర్పూర్, జనవరి 20 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నెంబర్ 3కి చెందిన పలువురు నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో సీనియర్ నాయకులు ముదిగొండ సాంబయ్య, చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు వారికి కాషాయ కండువాలు కప్పి స్వాగతం పలికారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్‌పై కాషాయ జెండా ఎగరేస్తామని చేరిన నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలు



**పెద్దపల్లి, జనవరి 20 పెన్ పవర్:** మంగళవారం, వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఉదయం నుంచే సందడి నెలకొంది. భక్తులు అమ్మవారికి బోనాల నైవేద్యాలు, పసుపు కుంకుమలు సమర్పించి, అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. మేడారం జాతర సందర్భంగా కూడా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకోవడానికి వస్తున్నారు.

## కొండగట్టు అంజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

**జగిత్యాల, జనవరి 20 పెన్ పవర్:** మంగళవారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల తాకిడి పెరిగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా ఘాట్ రోడ్డుపై వాహనాలు కాసేపు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో శ్రీకాంతరావు పరిశీలించారు.

# జ్యూరిచ్ లో సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం



**హైదరాబాద్ పెన్ పవర్:**వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు 2026లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్లోని జ్యూరిచ్ నగరానికి చేరుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రతినిధి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్కు చేరుకున్నారు. దావోస్లో నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (ఔజుఖీ) సమావేశాలు తెలంగాణ ప్రతినిధి బృందం పాల్గొననుంది. మొదటి రోజున వివిధ రంగాల కు చెందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో జరిగే సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్ మ్యాప్ను పరిచయం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులకున్న అనుకూలతలను ప్రస్తావించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.డిసెంబర్ లో ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లో పొందుపరిచిన అభివృద్ధి నమూనా కు అనుగుణంగా సుస్థిర పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యం ఎంచుకున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హరీష్ తో మొదలై... కేసీఆర్ తో ముగుస్తుందా

**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:**
సీఎం రేవంత్ రెడ్డి గులాబీ పార్టీ గద్దెలు మొత్తం కూలాలని ఇటీవల వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీని వంద మీటర్ల లోతులో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలు ఏదో రాజకీయ వ్యవహారంలో చేసినవని అందరూ అనుకున్నారు. కానీ, ముఖ్యమంత్రి వ్యాఖ్యల వెనుక లోతైన వ్యవహారం ఉందని ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది.ఖమ్మం సభలో రేవంత్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. ఆ తర్వాత ఒక్కరోజు గ్యాప్ లోనే ఆ పరిణామాలు ఎలా ఉంటాయో గులాబీ పార్టీకి అర్థమైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి ఆక్టివ్ అయింది. ఈసారి మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన విచారణకు హాజరు అయ్యారు. సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద ఆయనకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారులు ఎదుట హరీష్ రావు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఏసిపి వెంకటగిరి ఈ నోటీసులను హరీష్ రావుకు అందించారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ టాపింగ్ జరిగిందని పదేపదే రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. చివరికి కేసీఆర్ కుమార్తె కూడా ఫోన్ టాపింగ్ జరిగిందని చెబుతున్నారు. తన భర్త ఫోన్ ను కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరించారని కవిత ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫోన్ టాపింగ్ వ్యవహారంపై వేగంగా అడుగులు వేస్తోంది. ఫోన్ టాపింగ్ వల్ల గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయోజనాలు పొందారు? నాటి ప్రభుత్వ పెద్దల కోసం పనిచేసిన వారు ఎలాంటి ఫలితాన్ని ఆశించారు? అనే విషయాలను బయట పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం కృషి చేస్తుంది.హరీష్ రావు కు సిట్ నోటీసు ఇవ్వడం సంచలనం కలిగించింది. ఈ కేసులో ముందుగా హరీష్ రావును, ఆ తర్వాత కేటీఆర్ ను, అనంతరం కేసీఆర్ ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తుంది అనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. విచారణలో సేకరించిన సమాచారం తర్వాత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ రావును విచారించి స్టేట్మెంట్ రికార్డు చేస్తారని తెలుస్తోంది.గతంలోనే తనకు నోటీసులు అందుతాయని హరీష్ రావు చెప్పారు.. పంచాయతీ ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తనకు కూడా ఇస్తారని హరీష్ రావు చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే అది జరుగుతుందని హరీష్ రావు గతంలోనే వ్యాఖ్యానించారు.. ఇక ఈ వ్యవహారంలో ముందు నుంచి కూడా కేసీఆర్ పేరు వినిపిస్తోంది. త్వరలోనే ఆయనను విచారిస్తారని.. దానికంటే ముందు నోటీసులు పంపిస్తారని ప్రచారం జరుగుతోంది.

# ఇండోర్ లో కాస్ట్లీ బిచ్చగాడు.. రీల్ కాదు... రియల్

**భోపాల్, జనవరి 20, పెన్ పవర్:**
బిచ్చగాడు సినిమా చూశారా.. అందులో విజయ్ ఆంటోని బిచ్చం ఎత్తుకుంటూ జీవిస్తుంటాడు. అతడి దుస్థితిని చూసి చాలామంది బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో విజయ్ ఆంటోని వెతుక్కుంటూ చాలామంది వస్తారు. అతడిని చూసి వాహనాల శ్రేణిని ఆపుతారు. ఆ తర్వాత విజయ్ ఆంటోని ఆ కారులోకి ఎక్కుతాడు. చూసేందుకు ఆ సన్నివేశం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇటువంటివి రీ లైఫ్ లో మాత్రమే సాధ్యం. రియల్ లైఫ్ లో పాసిబుల్ కావు. కానీ దీనిని నిజం చేసి చూపించాడు ఈ వ్యక్తిమన దేశంలో శుభ్రమైన నగరంగా పేరుపొందిన ఇండోర్ లో ఓ వ్యక్తి యాచకుడిగా జీవిస్తున్నాడు. కాకపోతే అతడు కూటికి గతి లేని వాడు కాదు. గుడ్డకు దిక్కులేనివాడు కాదు. అతడికి ఏకంగా మూడు నివాసాలు ఉన్నాయి. అంతకుమించి అనే స్థాయిలో కార్లు ఉన్నాయి. ఇక ఆటోల గురించి చెప్పాల్సిన పనిలేదు. వడ్డీ వ్యాపారం.. భారీగా బంగారం.. ఇలా చెప్పుకుంటూ పోతే అతడు అత్యంత ఖరీదైన బిచ్చగాడు. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం బెగ్గర్ ఎరాడికేషన్ క్యాంపియన్ నిర్వహించింది. ఇందులో అతనికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి.మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడమేనక బలమైన కారణం ఉంది. వీధుల్లో యాచక వృత్తి చేసుకుంటూ జీవించేవారికి ప్రభుత్వం తరఫున ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో యాచించుకుంటూ జీవిస్తున్న మంకీలాల్ అనే వ్యక్తి పై ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. అతడికి పునరాగం కల్పించడానికి ప్రయత్నాలు చేశారు. అయితే వారు అనుకున్నట్టుగా మంగీలాల్ కూటికి గతి లేనివాడు కాదు. అతడికి భారీగా ఆస్తులు ఉన్నాయి.అధికారుల పరిశీలనలో మంగీలాల్ ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి. మంగీలాల్ వద్ద 600 స్క్వేర్ ఫీట్ సామర్థ్యంతో భగత్ సింగ్ నగర్, శివనగర్, అల్వాస్ అనే ప్రాంతాలలో మూడు నివాసాలు ఉన్నాయి. మూడు ఆటోలు, స్విఫ్ట్ డిజైర్ కార్లు ఉన్నాయి. ఆ కారు నడపడం కోసం మంగీలాల్ ఒక డ్రైవర్ ను కూడా నియమించుకున్నాడు. తను ఈ యాచించడానికి ఎక్కడికి వెళ్లాలన్నా ఆ కారులోనే ప్రయాణ సాగిస్తుంటాడు. ఖాళీ సమయంలో మాత్రం అద్దెకు తిప్పుతుంటాడు. మరోవైపు మంగీలాల్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం 1బిహెచ్కే ఇల్లు కేటాయించింది. అయినప్పటికీ అతడు బిచ్చం ఎత్తుకోవడాన్ని. చెక్కతో చేసిన ఒక కార్డు పట్టుకొని ఇండోర్ నగరంలో యాచిస్తున్నాడు. అంతేకాదు సరఫ బజార్ ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారం కూడా చేస్తున్నాడు.

# పూరికి కలిసి రాని కాలం

**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:**
బద్రి సినిమాతో దర్శకుడి గా తన కెరియర్ ను స్టార్ట్ చేసిన డైరెక్టర్ పూరి జగన్నాథ్ఙబద్రి మూవీ ఇచ్చిన సక్సెస్ తో తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకున్నాడు. వరుసగా సినిమాలను చేస్తూ స్టార్ డైరెక్టర్ గా ఎదిగాడు. ప్రస్తుతం ఇండస్ట్రీ లో ఉన్న స్టార్ హీరోలందరికి ఆయన సక్సెస్ లను అందించాడు. స్టార్ హీరోల అభిమానులకు కూడా పూరి జగన్నాథ్ అంటే రెస్పెక్ట్ పెరిగింది. చాలామంది హీరోల అభిమానులు సైతం అతని ఫ్యాన్స్ గా మారిపోయారు. అలాంటి పూరి జగన్నాథ్ గత కొద్దిరోజుల నుంచి సరైన సక్సెస్ ని సాధించడంలో తడబడుతున్నాడు. ఇక ప్రస్తుతం విజయ్ సేతుపతితో చేస్తున్న 'స్లమ్ డాగ్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమా విజయ్ సేతుపతికి అనుకున్న విజయాన్ని సాధించి పెడుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందేఙఈ సినిమాతో సక్సెస్ వస్తేనే పూరి జగన్నాథ్ కి స్టార్ హీరోల నుంచి అవకాశాలు వచ్చే ఛాన్సులైతే ఉన్నాయి. ఒకవేళ ఈ సినిమా తేడా కొడితే మాత్రం పూరి జగన్నాథ్ షెడ్డు కి వెళ్లి పోవాల్సిందే అంటూ మరి కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా అతను ఇంతకుముందు ఎలాగైతే కసిగా సినిమాలు తీసేవాడో అలాంటి కసి ఇప్పుడు కనిపించడం లేదు.ఒకవేళ ఆయన మరోసారి అలా ఫోకస్ తో సినిమాలను చేస్తే ఇప్పటికి కూడా సూపర్ సక్సెస్ లను సాధించే అవకాశం ఉంది. నిజానికి అతని కంటే తక్కువ టాలెంట్ ఉన్నవారు సైతం సినిమాలను ఈజీగా సక్సెస్ ఫుల్ గా నిలుపుతున్నారు. పూరి జగన్నాథ్ కేవలం సినిమా మీద ఫోకస్ చేయకపోవడం వల్లే అలా ఆయన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి అంటూ మరికొంతమంది కామెంట్లు చేస్తున్నారుఙఏది ఏమైనా కూడా పూరి జగన్నాథ్ మరోసారి రాణించాలి అంటే మాత్రం స్లమ్ డాగ్ సినిమాతో తప్పకుండా సూపర్ సక్సెస్ ని సాధించాలి. అది ఏ మాత్రం తేడా కొట్టిన కూడా అతని కెరియర్ అనేది ముగిసిపోవడం పక్కా అంటూ మరి కొంతమంది కామెంట్లు చేస్తున్నారుఙ

# అమెరికాలో లీడర్‌షిప్ పాఠాలు నేర్చుకోనున్న సీఎం



**హైదరాబాద్, జనవరి 20, పెన్ పవర్:**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే ప్రత్యేక కోర్సులో చేరనున్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు తర్వాత, జనవరి 25 నుంచి 30వరకు జరిగే ఈ ఇంటెన్సివ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారం, ప్రజలను ప్రభావితం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా కొత్త అవతారంఎత్తనున్నారు. క్లాసులకు వెళ్లి శ్రద్ధగా పాఠాలు విననున్నారు. విజ్ఞాన సముపార్జన కోసం ఆయన మళ్లీ స్టూడెంట్‌గా మారాలని నిర్ణయించుకున్నారు. అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ వేదికగా నిర్వహించే '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే ప్రత్యేక కోర్సులో ఆయన చేరనున్నారు. మేడారం పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతోకాసేపటి క్రితం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరారు. అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ముగిసిన అనంతరం.. జనవరి 23న ఆయన నేరుగా అమెరికాకు వెళ్తారు. మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ కెన్నెడీస్కూల్ క్యాంపస్‌లో జనవరి 25 నుంచి 30 వరకు జరిగే స్పెషల్ క్లాసులకు రేవంత్ రెడ్డి హాజరవుతారు. వారం రోజుల పాటు సాగే ఈ ఇంటెన్సివ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ముగిసిన తర్వాత.. యూనివర్సిటీ నుంచి సర్టిఫికేట్ అందుకుని ఫిబ్రవరి 2న తిరిగి హైదరాబాద్ చేరుకుంటారుహార్వర్డ్ కెన్నెడీ స్కూల్–ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ విభాగం ఈ కోర్సును అత్యంత అనుభవజ్ఞులైన నాయకుల కోసం రూపొందించింది. ఇది కేవలం సిద్ధాంతాలకుపరిమితం కాకుండా.. నిజ జీవితంలో ఎదురయ్యే క్లిష్టమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుంది. అనిశ్చిత పరిస్థితులు, రాజకీయ మార్పులు, విభేదాలను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి? కేవలం అధికారంద్వారా కాకుండా.. పనితీరు, వ్యక్తిత్వంతో ప్రజలను ఎలా ప్రభావితం చేయాలి ప్రజలను కొత్త ఆలోచనల వైపు, సామాజిక మార్పు వైపు ఎలా ప్రేరేపించాలి ? అంశాలపై ప్రత్యేక తరగతులు ఉంటాయి. అంతర్జాతీయ స్థాయిలోజరిగిన కేస్ స్టడీస్, గ్రూప్ డిస్కషన్స్, రియల్–లైఫ్ లీడర్‌షిప్ సవాళ్లపై లోతైన విశ్లేషణ ఉంటుంది.రాజకీయ నాయకులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలకు మాత్రమే ఈ కోర్సులో ప్రవేశం ఉంటుంది. ఈ తరహా శిక్షణ ద్వారా రాష్ట్ర పాలనలో మరిన్ని వినూత్న మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వ్యక్తిగత నాయకత్వ శైలిని ఆత్మపరిశీలన చేసుకునేందుకు.. అంతర్జాతీయస్థాయి నాయకులతో నెట్‌వర్కింగ్ పెంచుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడనుంది. ఇండియా నుంచి ఈ తరహా కోర్సుకు ప్రత్యక్షంగా హాజరై అభ్యసించనున్న తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కావడం గమనార్హం. కోర్సుముగిశాక సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు ఫిబ్రవరి 2న చేరుకోనున్నారు.

# వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి

**విజయనగరం, జనవరి 20, పెన్ పవర్:** ప్రస్తుతం వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందన్న మాట ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై పైచేయి సాధించేందుకు ఎంచుకున్న వ్యూహాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటికి క్రెడిట్ తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు.అయితే ఈ ప్రచారం ప్రజల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఏ పని చేసినా అది జరిగినప్పుడే చెప్పుకోవాలి అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని అంటున్నారు. నిజంగా ఆ పనులు అప్పట్లో జరిగి ఉంటే, అప్పుడే వాటిని ప్రజల ముందు బలంగా ఉంచాల్సిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆలస్యంగా చెప్పుకుంటున్న మాటలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకొక వైపు సోషల్ మీడియా ప్రచారం కూడా పార్టీకి కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్న కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ, వాటిని వక్రీకరించి పోస్టులు పెట్టడం ద్వారా లాభం ఉంటుందని భావించారు. కానీ ఈ ప్రయత్నం కూడా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని నేతలే చెబుతున్నారు. ఇలాంటి అనుచిత ప్రచారం వల్ల ప్రభుత్వానికి నష్టం కంటే, తమకే నష్టం జరుగుతోందన్న భావన పార్టీ లోపల పెరుగుతోంది.మొత్తంగా చూస్తే వైసీపీ ఎంచుకున్న రాజకీయ ఎత్తులు పనిచేయడం లేదన్న భావన బలపడుతోంది. ఇదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న నాయకుల సంఖ్య కూడా పెరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముందుగా వీరిని నిలువరించాల్సిన అవసరం



ఉందని కొందరు సూచిస్తున్నా, అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. పోయేవారు పోతే పోనీయండి అన్న ధోరణి కొనసాగుతుండటంతో మిగిలిన నాయకుల్లోనూ నిరాశ పెరుగుతోంది.ఈ పరిస్థితుల్లో చిన్న అవకాశం దొరికినా పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. ఒకప్పుడు బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహాలతో ముందుకు సాగిన పార్టీ ఇప్పుడు అయోమయంలో ఉందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే కేవలం ప్రచారంతో కాకుండా, స్పష్టమైన దిశానిర్దేశం, నాయకత్వ నిర్ణయాలు అవసరమన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే సాగుతోంది.ఇదిలా ఉండగా, గత ఎన్నికల సమయంలోనే తాను మళ్లీ పోటీ చేయబోనని నాని ప్రకటించారు. తన సోదరుడి కుమారుడిని రాజకీయ వారసుడిగా సూచించినా, పార్టీ పెద్దల ఆలోచన వేరేలా ఉన్నట్లు తెలుస్తోంది. నానిని నియోజకవర్గ రాజకీయాల నుంచి తప్పించి, పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయం ఉన్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే, ఆయనకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి పదవులు దక్కే అవకాశముందన్న ప్రచారం కొనసాగుతోంది. ఇందులో ఎంత నిజం ఉందో రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.

# వరుస వివాదాల్లో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

**అనంతపురం, జనవరి 20, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆశించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పుడు పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వరుస వివాదాల్లో చిక్కుకోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా ఆయనపై వస్తున్న ఆరోపణలు కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితం కాకుండా, శాంతిభద్రతల సమస్యగా, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశాలుగా మారుతున్నాయి.వివాదాల పరంపర మే 2025లో జిల్లా పరిషత్ సమావేశం వేదికగా ప్రారంభమైంది. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పట్ల ఎమ్మెల్యే ప్రసాద్, మరికొందరు అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమె పర్సనల్ చాంబర్‌లోకి బలవంతంగా చొరబడి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోటో ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసభ్య పదజాలంతో దూషించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మహిళా నాయకురాలి పట్ల ఎమ్మెల్యే తీరుపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి.ఇక ఆగస్టు 2025లో వెలుగులోకి వచ్చిన ఒక ఆడియో క్లిప్ ఎమ్మెల్యే రాజకీయ జీవితంలో పెను తుపాను సృష్టించింది. టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి ఆయన అసభ్య వ్యాఖ్యలు చేశారని, అనంతపురంలో ఆయన సినిమా 'వార్ 2' ప్రదర్శించకుండా అడ్డుకుంటామని బెదిరించారని ఎన్టీఆర్ అభిమానులు భగ్గుమన్నారు. ఈ వ్యవహారం ముదిరి ఎమ్మెల్యే కార్యాలయంపై దాడులు, నిరసనలకు దారితీసింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని మందలించడంతో, ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పి సర్దుబాటు చేసుకున్నప్పటికీ, అభిమానుల్లో ఆయనపై ఉన్న ఆగ్రహం చల్లారలేదు.ఈ ఏడాది ప్రారంభం నుంచి ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. జనవరి 13న అనంతపురంలోని ఒక ఎగ్జిబిషన్ వద్ద ఎమ్మెల్యే గన్‌మన్ షేక్ షా చేసిన హల్‌చల్ సంచలనం సృష్టించింది. నిర్వాహకుల నుంచి రూ.10 లక్షల మామూలు డిమాండ్ చేశారని, నిరాకరించినందుకు స్టాఫ్‌పై దాడి చేసి భయానక వాతావరణం సృష్టించారని బాధితులు వాపోతున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గన్‌మన్‌ను సస్పెండ్ చేసినప్పటికీ, ఈ వ్యవహారం వెనుక ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అంతేకాకుండా, ఇటీవల ఎమ్మెల్యే అనుచరులపై మరిన్ని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అడిగినంత డబ్బు ఇవ్వలేదని ఒక వైన్ షాపును తగలబెట్టించారనే ఆరోపణలున్నాయి. విలువైన భూములను ఆక్రమించుకోవడం లేదా సెటిల్‌మెంట్ల పేరుతో బెదిరింపులకు దిగడం అలవాటుగా మారిందని స్థానికులు చెప్పుకుంటున్నారు. ఆస్రా కళ్ల అద్దాల దుకాణానికి సంబంధించి ఒక భూ వివాదంలో ఎమ్మెల్యే తలదూర్చారు. అసభ్యకరమైన పదజాలంతో దుకాణం మహిళా యజమానిపై వ్యాఖ్యలు చేశారు. ఆ ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.ఈ ఆరోపణలన్నింటినీ ఎమ్మెల్యే వర్గం 'రాజకీయ కుట్ర'గా కొట్టిపారేస్తోంది. అయితే, జిల్లాలో ఎంతోమంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, కేవలం దగ్గుపాటి ప్రసాద్ పైనే ఇన్ని రకాల ఆరోపణలు ఎందుకు వస్తున్నాయన్నది ప్రజల ప్రశ్న. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్లుగా, ఆయన అనుచరుల అరాచకాలు శ్రుతి మించుతున్నాయని సామాన్య ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలు తీర్చాల్సింది పోయి, వసూల్ రాజా అవతారం ఎత్తడంపై ప్రజల్లో అసహనం పెరుగుతోంది.తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకుంటున్న తరుణంలో, ఎమ్మెల్యే ప్రసాద్ వ్యవహారం పార్టీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. నిజానిజాలు విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఒక ప్రజాప్రతినిధిగా ఆయన తన నైతికతను కోల్పోయారనే వాదన బలంగా వినిపిస్తోంది.

# రైతుల ఒకే చోట రిటర్నబుల్ ప్లాట్లు



**విజయవాడ, జనవరి 20, పెన్ పవర్:** రాజధాని అమరావతి విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఏడు గ్రామాల పరిధిలో భూమిని సమీకరించనున్నారు. ఇప్పటికే ప్రక్రియ కూడా మొదలైంది. మరోవైపు అమరావతి కోసం తొలివిడత భూసమీకరణ సమయంలో చేసిన విధంగా కాకుండా.. రెండో విడతలో భూములు ఇచ్చే రైతులకు ఒకేచోట రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించాలని సీఆర్డీఏ భావిస్తున్నట్లు సమాచారం. ఏడు గ్రామాల రైతులకు ఒకేచోట లేఅవుట్ అభివృద్ధి చేసి రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించే ఆలోచనలో సీఆర్డీఏ ఉన్నట్లు తెలిసింది.అమరావతి రాజధాని కోసం ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని రెండో విడతలో సమీకరించనున్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనుంది. అయితే తొలివిడతలో మాదిరిగా కాకుండా ఈసారి రైతులందరికీ ఒకేచోట రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనున్నట్లు సమాచారం. అమరావతి కేపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చే రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్డీఏ సింగిల్ లేఅవుట్ అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం.ఈ దిశగా సీఆర్డీఏ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రతిపాదనకు ఆమోదం కోసం ప్రభుత్వానికి నివేదించనున్నారు. రాజధాని అమరావతి విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతోంది. తొలి దశలో రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు ప్రతి గ్రామంలో లేఅవుట్లను అభివృద్ధి చేశారు. రైతులు తమ గ్రామాల్లోనే రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించాలని పట్టుబట్టడంతో ప్రభుత్వం.. వారి గ్రామాల్లోనే లేఅవుట్లను అభివృద్ధి చేశారు.అయితే ఈ నిర్ణయంతో లేఅవుట్ల అభివృద్ధి తర్వాత ప్రభుత్వానికి లభించిన భూమి వేర్వేరు ప్రాంతాలలో ఉండిపోయింది. పెద్ద కేటాయింపులు చేయడానికి ఒకే చోట పెద్ద మొత్తంలో భూమి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వానికి సమస్యలు ఎదురయ్యాయి.మరోవైపు ఎక్కువ లేఅవుట్లు ఉండటం వల్ల ప్రతి లేఅవుట్‌కు ప్రత్యేక మౌలిక సదుపాయాలు అవసరమని, దీనివల్ల ఖర్చులు పెరుగుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే రెండో విడతలో భూములు అప్పగించే రైతులకు ఒకేచోట లేఅవుట్ అభివృద్ధి చేసి.. అందులోనే రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించే ఆలోచనలు చేస్తున్నారు. మరోవైపు ఒకే చోట ప్లాట్లు కేటాయించడం వల్ల ప్రభుత్వం సేకరించిన భూములు ఏకీకృతం అవుతాయని, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి ప్రాజెక్టులకు కేటాయించడానికి అనుకూలంగా ఉంటాయని సీఆర్డీఏ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులకు ఒకే చోట భారీ భూమి అవసరమని అధికారులు చెప్తున్నారు.మరోవైపు అభివృద్ధి చేసిన ప్లాట్లను వెంటనే అప్పగించాలని రైతులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. ఒకే లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తే పనులు త్వరగా పూర్తి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచేందుకు సీఆర్డీఏ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు

## 'నోబెల్' ఇవ్వలేదు.. ఇక శాంతి గురించి ఆలోచించను



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్ అంశాన్ని నోబెల్ శాంతి బహుమతితో ముడిపెట్టారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. తాను 8కి పైగా యుద్ధాలు ఆపానని.. అయినా తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకూడదని నార్వే నిర్ణయించిందని అన్నారు. కాబట్టి ఇక శాంతి గురించి తాను ఆలోచించనని, అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తానని పేర్కొన్నారు. ఈ మేరకు నార్వే ప్రధాని జోనస్ గా స్టోర్‌కు ఫోన్ ద్వారా సందేశం పంపారు. గ్రీన్‌లాండ్ ద్వీపంపై డెన్మార్క్ యాజమాన్య హక్కులను లేఖలో ట్రంప్ ప్రశ్నించారు. ఆ దీవి తమదేనని చెప్పడానికి ఆ దేశం దగ్గర ఎలాంటి రాతపూర్వక పత్రాలు లేవని అన్నారు. వందల సంవత్సరాల క్రితం తమ దేశ పడవ ఒక్కటి ఆ ద్వీపానికి వెళ్లిందని మాత్రమే డెన్మార్క్ చెబుతోందని, అలాగైతే తమ పడవలు చాలానే ఆ ద్వీపానికి వెళ్లాయని అన్నారు. గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించాలని చైనా, రష్యా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, వాటి నుంచి ఆ ద్వీపాన్ని రక్షించే సత్తా డెన్మార్క్‌కు లేదని పేర్కొన్నారు. నాటో కోసం తాను ఎంతో చేశానని.. ఇప్పుడు అమెరికా కోసం నాటో ఏదో ఒకటి చేయాలని అన్నారు. ప్రపంచం సురక్షితంగా ఉండాలంటే గ్రీన్‌లాండ్‌పై పూర్తి నియంత్రణ అమెరికాకు ఉండాల్సిందేనంటూ సందేశాన్ని ముగించారు. దీనిపై నార్వే ప్రధాని స్పందించారు. నోబెల్ శాంతి బహుమతితో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని, విజేతలను స్వతంత్ర నోబెల్ కమిటీ ఎంపిక చేస్తుందని చెప్పారు.

## బీజేపీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం జరిగిన నామినేషన్ల తర్వాత ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధిష్ఠానం ప్రకటించింది. ఈ క్రమంలో నేడు ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా పాల్గొని నితిన్ నబీన్‌ను సత్కరించారు. ప్రస్తుతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, ఇప్పుడు పూర్తి స్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ వేడుకలో ప్రధాని మోడీతో పాటు పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితర అగ్రనేతలు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు. జాతీయ ఎన్నికల అధికారి కె. లక్ష్మణ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఎన్నిక ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే సాగింది. దేశవ్యాప్తంగా ఉన్న 36 రాష్ట్ర యూనిట్లలో 30 మంది రాష్ట్ర అధ్యక్షులు ఎన్నికైన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మొదలైంది. నితిన్ నబీన్ పేరును ప్రతిపాదిస్తూ మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి అగ్రనేతలే ఆయన పేరును ప్రతిపాదించడం విశేషం. జనవరి 19న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య జరిగిన నామినేషన్ల ప్రక్రియలో నితిన్ నబీన్ తప్ప మరెవరూ పోటీలో లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పార్టీలో 'సంగఠన్ పర్వ్' పేరుతో జరిగిన ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ద్వారా నూతన సారధిని ఎంచుకున్నారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, కీలక నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా సీనియర్ నేతలు హాజరయ్యారు.

## కేరళలో వ్యక్తి మరణానికి కారణమైన మహిళపై ఎఫ్ఐఆర్ నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళలో కోజికోడ్ బస్సులో దీపక్ అనే వ్యక్తి అసభ్యంగా తాకాడని ఆరోపిస్తూ ఓ మహిళ సోషల్ మీడియాలో వీడియో పెట్టడంతో అతడు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా పోలీసులు ఆ మహిళపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీడియో వైరల్ అవ్వడం వల్లనే అవమాన భారంతో దీపక్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడంటూ అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులు చెబుతున్నారు. వీడియోలోనూ దీపక్ ముందు నిలబడటం ఆ మహిళ అతడి వెనుక ఉండటంతో తనే కావాలని వీడియో తీసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిజంగానే అసభ్యంగా తాకితే వెంటనే అతడిని నిందించాల్సిందని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని అంటున్నారు. కానీ అలా చేయకుండా అతడి పక్కనే ఉండి సోషల్ మీడియాలో వ్యూస్ కోసమే వీడియో తీసి షేర్ చేసిందని కామెంట్స్ చేస్తున్నారు. పురుషులు మాత్రమే కాకుండా మహిళలు సైతం ఆత్మహత్య చేసుకుని చనిపోయిన దీపక్ కే మద్దతు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే దీపక్ ను ఆత్మహత్యకు పురిగొల్పిందని సదరు మహిళపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

## ప్రపంచ ఆర్థిక వేదికకు నిరసన సెగ




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్)కు నిరసనల సెగ తగిలింది. సోమవారం నుంచి 23 వరకూ స్విట్జర్లాండ్‌లో ప్రపంచ దేశాల నేతలు భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూఈఎఫ్ నియంతృత్వం కంటే ప్రజాస్వామ్యమే ముఖ్యం" అంటూ నిరసనకారులు హోరెత్తించారు. వామపక్ష సోషల్ డెమోక్రటిక్ పార్టీ యువజన విభాగం నేతృత్వంలో.. ఆగ్నేయ స్విట్జర్లాండ్‌లోని క్యూబ్లిస్ నుంచి పర్వత ప్రాంత రిసార్ట్ అయిన దావోస్ వైపు బయలుదేరారు. దాదాపు సగం మంది ప్రదర్శనకారులు స్విట్జర్లాండ్ నుంచి రాగా.. మరికొందరు ఇంగ్లాండ్, స్పెయిన్, దక్షిణ , పశ్చిమ ఆఫ్రికా, జర్మనీ నుంచి తరలివచ్చారు. పెట్టుబడిదారీ విధానానికి , వాతావరణ మార్పులను వేగవంతం చేస్తున్న యుద్ధాలకు ముగింపు పలకాలని, అలాగే అవసరాల ఆధారంగా ఆర్థిక వ్యవస్థను ప్రజాస్వామ్యీకరించాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాల్గొనడం ఈ నిరసనకు మరింత ప్రాముఖ్యతను ఇచ్చింది. "డబ్ల్యూఈఎఫ్ తన ఉనికికి గల కారణాన్ని కోల్పోయింది. ప్రపంచవ్యాప్తంగా పేదరికం , అసమానతలు పెరుగుతున్నాయి" అని ఆర్థిక విశ్లేషకులు తెలిపారు. స్విట్జర్లాండ్ ఆఫ్రికాకు కట్టుబడి ఉంది. కానీ అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా తమ దోపిడీకి విమర్శలు ఎదుర్కొంటున్న కంపెనీలకు కూడా ఇది నిలయంగా ఉందని వ్యాఖ్యానించారు. "ఇది ఒక సందిగ్ధ పరిస్థితి. స్విట్జర్లాండ్‌లో తమ డబ్బును పెట్టుబడిగా పెట్టాలనుకునే వారికి స్విట్జర్లాండ్ స్పష్టమైన షరతులు విధించాలి. మానవ హక్కులను గౌరవించాలని డిమాండ్ చేయాలి" అని కోనే అన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965


## శాంతి బహుమతిని వెనక్కి తీసుకోండి

**హైదరాబాద్ పెన్ పవర్:** తనకు ప్రదానం చేసిన నోబెల్ శాంతి బహుమతిని వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అందజేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మచాడో చర్యపై నోబెల్ ఫౌండేషన్ కూడా ఆగ్రహంతో ఉంది. మచాడోకు ప్రకటించిన శాంతి బహుమతిని రద్దు చేయాలని లేదా దానిని వేరే వారికి బదిలీ చేయాలని పలువురు ప్రముఖులు నోబెల్ ఫౌండేషన్‌ను కోరుతున్నారు. నోబెల్ బహుమతి ట్రంప్ చేతిలోకి వెళ్లినా అది మచాడో పేరిటే ఉంటుందని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ వివరణ ఇచ్చింది. 'మచాడో బంగారు పతకాన్ని ట్రంప్‌కు ఇచ్చినప్పటికీ ఆ బహుమతి ఆమె పేరిటే ఉంటుంది. బహుమతిని బదిలీ చేయడం, పంచుకోవడం లేదా రద్దు చేయడం కుదరదని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదు' అని గత వారం తెలియజేసింది. దీనిపై పునరాలోచన చేయాలని అభ్యర్థనలు రావడంతో నోబెల్ ఫౌండేషన్ మరోసారి వివరణ ఇచ్చింది. నోబెల్ బహుమతిని బదిలీ చేయడానికి లేదా రద్దు చేయడానికి ఆల్‌ఫ్రెడ్ నోబెల్ నిబంధనలు అంగీకరించవని తెలిపింది.

## చిన్నారులకు సోషల్ మీడియా నిషేధం?

**హైదరాబాద్ పెన్ పవర్:** చిన్నారులు, టీనేజర్లకు సోషల్ మీడియాను నిషేధించే విషయాన్ని ఫ్రాన్స్, బ్రిటన్ పరిశీలిస్తున్నాయి. ఈ విషయంపై ఆయా దేశాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. నిషేధాన్ని సమర్థించేవారు చిన్నారులు, యువతలో క్షీణిస్తున్న మానసిక ఆరోగ్యాన్ని చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. మరికొంత మంది పూర్తిగా ఆధారాలతో సూక్ష్మమైన విధానాన్ని కోరుకుంటున్నారు. గతేడాదిలో ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు చిన్నారులు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టిక్‌టాక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ఫాట్‌ఫామ్‌లు ఉపయోగించకుండా నిషేధం విధించింది. ఇలాంటి నిషేధం విధించిన తొలి దేశంగా అవతరించింది. ఫ్రాన్స్ కూడా ప్రస్తుతం 15 ఏళ్లలోపు వారిపై ఇలాంటి నిషేధం విధించే బిల్లును ప్రవేశపెట్టడంపై చర్చిస్తోంది. బ్రిటన్‌లో కూడా ఇలాంటి నిషేధం విధించాలని అక్కడి ప్రభుత్వం యోచనలో ఉంది. అనేకమంది నిపుణులు ఈ విషయంపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు.

## మైనారిటీలపై అత్యధిక ఘటనలు మతంతో సంబంధం లేనివి



**హైదరాబాద్ పెన్ పవర్:** గతేడాది మైనారిటీలకు సంబంధించిన అత్యధిక ఘటనలు నేరప్రవృత్తితో కూడుకున్నవని, మతపరమైన ఉద్దేశంతో కాదని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌కి చెందిన మీడియా విభాగం సోమవారం ఈ ప్రకటన విడుదల చేసింది. మైనారిటీలపై దాడులను త్వరగా, స్పష్టంగా ఎదుర్కోవాలని భారత ప్రభుత్వం జనవరి 9న బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ప్రకటనపై స్పందిస్తూ బంగ్లాదేశ్ ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. అధికారిక పోలీస్ రికార్డుల ప్రకారం.. దేశవ్యాప్తంగా 2025లో జనవరి–డిసెంబర్ మధ్య మైనారిటీ వర్గాలకు సంబంధించిన మొత్తం 645 ఘటనలు నమోదయ్యాయని తెలిపింది. ప్రతి సంఘటన ఆందోళన కలిగించే అంశమే అయినప్పటికీ, డేటా స్పష్టమైన మరియు సాక్ష్యాధారాల ఆధారిత చిత్రాన్ని అందిస్తుందని, అధిక శాతం కేసులు నేరప్రవృత్తితో కూడినవని పేర్కొంది. మొత్తం 645 ఘటనల్లో 71 మతపరమైన అంశాలవి ఉన్నట్లు నిర్ధారణైనట్లు తెలిపింది. వాటిలో 38 ఆలయ విధ్వంసం కేసులు, ఎనిమిది దహనం కేసులు, ఒక దొంగతనం కేసు, ఒక హత్య కేసు కాగా మిగిలిన 23 ఘటనలు విగ్రహాలను ధ్వంసం చేస్తామన్న బెదిరింపులు, రెచ్చగొట్టే సోషల్‌మీడియా పోస్టులు, పూజా మండపాలకు నష్టం కలిగించడం వంటివి ఉన్నాయని ప్రకటన పేర్కొంది. వాటిలో 50 ఘటనలపై పోలీసు కేసులు నమోదయ్యాయని, అరెస్టులు జరిగాయని తెలిపింది. 21 ఘటనల్లో నివారణ లేదా దర్యాప్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. మిగిలిన 574 ఘటనలు మతంతో సంబంధం లేని నేర ప్రవృత్తితో కూడుకున్న లేదా వివాదాలకు సంబంధించినవి. వీటిలో పొరుగు ఇళ్లతో వివాదాలు (51), భూసంబంధిత ఘర్షణలు (23), దొంగతనం (106), వ్యక్తిగత శతృత్వం (26), అత్యాచారం (58), 172 అసహజ మరణ కేసులు ఉన్నాయి. ఈ కేటగిరీలో 390 ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేయగా, 154 అసహజ మరణాల నివేదికలను నమోదు చేశారని, 498మందని అరెస్ట్ చేశారని, 30 ఘటనల్లో అదనపు చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది.

## స్పెయిన్‌లో హైస్పీడ్ రైళ్లు ఢీ



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ స్పెయిన్‌లో హై స్పీడ్ రైళ్ళు ఢీకొని 39మంది మరణించారు. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనలో హై స్పీడ్‌తో వెళుతున్న రైలు ఎదురుగా వస్తున్న రైలు మీదకు దూసుకెళ్ళిపోయి, తర్వాత పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రెండు రైళ్ళలోనూ దాదాపు 500మంది ప్రయాణికులు వున్నారని మీడియా వార్తలు తెలిపాయి. ఈ సంఘటనలో ఒక రైలు బాగా దెబ్బతిందని, నాలుగు బోగీలు పట్టాలు తప్పాయని అగ్నిమాపక దళ చీఫ్ ఫ్రాన్సిస్కో కర్మోనా తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా 200కి పైగా రైళ్ళు సోమవారం రద్దయ్యాయని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణం ఇంకా దర్యాప్తు చేయాల్సివుంది. సంఘటనా ప్రాంతంలో పరిస్థితి అత్యంత దారుణంగా వుంది. పైగా ఆ ప్రాంతానికి చేరుకోవడం చాలా కష్టంగా వుంది. బాధితులకు అవసరమైన బ్లాంకెట్లు, నీరు వంటివి స్థానికులు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా చాలా విస్తృతంగా తిరిగే ఈ హై స్పీడ్ రైళ్ళు స్పెయిన్‌లో బాగా పాపులర్. కాగా ఈ రైలు ప్రమాదం పట్ల భారత విదేశాంగ మంత్రి జై శంకర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని, సానుభూతిని తెలియచేశారు.

## ఖమేనీపై దాడి అంటే యుద్ధమే

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీపై దాడి చేస్తే అది పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీస్తుందని అమెరికాకు ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ హెచ్చరించారు. ఇరాన్‌లో నెలకొన్న సంక్షోభ పరిస్థితులకు అమెరికా, దాని మిత్రదేశాలు విధించిన అమానుష ఆంక్షలే ప్రధాన కారణమని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని చెప్పిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ఇరాన్ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ప్రధాన కారణం అమెరికా, దాని మిత్రదేశాలు సంవత్సరాలుగా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలే కారణం. మన దేశ సుప్రీం లీడర్‌పై ఎలాంటి దాడి జరిగినా అది ఇరాన్ దేశంపై యుద్ధం ప్రకటించినట్టే. దీనిని మేము సహించబోం' అని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. మరోవైపు నిర్బంధంలో ఉన్నవారికి ఉరిశిక్ష విధించే అంశంలో ముందుకెళుతామని ఇరాన్ న్యాయశాఖ అధికారి ప్రతినిధి తెలిపారు. కొన్ని కేసులను మోహరబ్ కింద నమోదు చేశామని వాటి విషయంలో చట్టం ప్రకారం నడుచుకుంటామని అన్నారు. ఇరాన్ చట్టంలో మోహరబ్‌ను దేవునిపై యుద్ధంగా పేర్కొన్నారు. మోహరబ్ కింద కేసు నమోదైతే ఇరాన్ చట్టం ప్రకారం ఉరిశిక్ష విధిస్తారని తెలిపారు.

# అసమాన నృత్య కళాకారిణి మృణాళిని

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మృణా ళినీ సారాభాయ్ పేరు శాస్త్రీయ నృత్య రంగంలో ఎరుగని వారు అరుదు. శాంతినికేతన్లో గురు రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర విద్యా భ్యాసం చేసిన మృణాళిని భరత నాట్యం, మోహినీ యాట్టం, కథాకళి నాట్య రీతులలో శిక్షణ పొందారు. నాట్యకారిణిగానే కాదు, కవయిత్రిగా, రచయితగా, నృత్య దర్శకురాలిగా ఆమె ఖ్యాతి పొందారు. మృణాళినికి భరతనాట్యం పంచ ప్రాణం. నాట్యమే సర్వస్వం. నాట్యం కోసం జీవితంలో అసలు పెళ్లే చేసుకో కూడదని అను కున్నారు. ఆమె కుటుంబానికి సన్నిహితులైన పరమాణు శాస్త్ర వేత్త హోమీ జహంగీర్ భాభానే... మరో శాస్త్రవేత్త విక్రమ్ సారా భాయ్‌ని మృణాళినికి పరిచయం చేశారు. విక్రమ్ ఆమెను కలిసిన తర్వాత ఆమె కూడా మారారు. తర్వాత... మృణాళిని విక్రమ్ పెళ్లి చేసుకున్నారు. మృణాళిని సారాభాయ్ (1918 మే 11 – 2016 జనవరి 21) భార తీయ సాంప్రదాయ నృత్య కళా కారిణి, నృత్య దర్శకురాలు, నృత్య గురువు. ఆమె "దర్పణ అకాడమీ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్"కు వ్యవ స్థాపకురాలు. అహ్మదాబాదులోని ఈ సంస్థలో నృత్య రీతులు, నాట కాలు, సంగీతం, తోలుబొమ్మ పాటలపై శిక్షణ ఇవ్వడం జరుగు తుంది. ఆమె 18,000 మంది శిష్యులకు భరత నాట్యం, కథాకళి లలో శిక్షణ ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు. మృణాళిని కేరళ లోని మాజీ పార్లమెంట్ సభ్యులు, సామాజిక కార్యకర్త అయిన అమ్ము స్వామి నాథన్ కుమార్తె. ఆమె బాల్యం స్విడ్జర్లాండ్ లో గడిచింది. ఆమె "డాల్‌క్రోజ్" పాఠశాలలో తొలి పాఠాలుగా పశ్చిమాది నృత్య భంగిమలను నేర్చుకున్నారు...ఆమె శాంతి నికేతన్‌లో రవీంద్ర నాథ్ ఠాగూర్ మార్గదర్శకత్వంలో విద్యా భ్యాసం చేశారు. అక్కడ జీవిత యదార్థాలను గ్రహించే అవకాశాలు కలిగాయి. తర్వాత ఆమె కొంత కాలం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళి.. అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషన లాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమాడ్రామాటిక్ ఆర్ట్సులో చేరారు. తర్వాత భారత దేశానికి వచ్చి ఆమె దక్షిణాది సాంప్రదాయక నృత్యం అయిన భరత నాట్యాన్ని "మీనాక్షి సుందరంపిళ్ళై" ద్వారా, కథాకళి నృత్యాన్ని "తకఘి కుంచు కురూప్" ద్వారా శిక్షణ పొందారు. మృణాళిని 1948 లో దర్పణ అనే సంస్థను స్థాపించారు. ఒక సంవత్స రం తరువాత పారిస్ లో "థియేటర్ నేషనల్ డి చైల్లోట్" లో ప్రదర్శన ఇచ్చారు. మృణాళిని సుమారు మూడు వందలకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఆమె అనేక నవలలు, కవితలు, నాటకాలు, కథలు పిల్లల కోసం రచించారు. ఆమె గుజరాత్ రాష్ట్ర హాండీక్రాఫ్ట్స్ అండ్ హాండ్ లూం డెవలప్ మెంట్ సంస్థకు చైర్‌పర్సన్ గా, గాంధీ ఆశయాల ప్రోత్సాహం కోసం యేర్పడిన, సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కు ఆమె ఒక ట్రస్టీగా కూడా ఉన్నారు. మృణాళిని సారాభాయ్ 1965లో పద్మశ్రీ, 1992 లో భారతదేశ విశిష్ట పురస్కారం పద్మభూషణ అవార్డు ను అందు కున్నారు. 1997 లో యు.కె లోని న్యూయాచ్ కు చెందిన అంగిలియా విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేష నలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా, మెడల్ అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1990 లో పారిస్ లోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీలో నామినేట్ చేయ బడ్డారు. 1994 లో న్యూఢిల్లీ లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మెక్సికో ప్రభుత్వం నుండి బంగారు పతకాన్ని పొందారు. సాంప్రదాయిక నృత్య రంగంలో "మృణాళినీ సారాభాయ్ అవార్డ్ ఫర్ క్లాసికల్ ఎక్సలెన్స్" అవార్డును ప్రకటించింది. 2013లో కేరళ ప్రభుత్వ వార్షిక పురస్కారమైన నిషాగంధి పురస్కారానికి ఆమె మొదటి గ్రహీత.మృణాళిని కుటుంబీకులు పేరు మోసిన వారు కావడం విశేషం. ఆమె తండ్రి డా.స్వామినాథన్ మద్రాసు హైకోర్టులో పేరు పొందిన బారిష్టరు. మద్రాసు లా కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అమె తల్లి అమ్ము స్వామినాథన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మాజీ ఎం.పీ. మృణాళిని సోదరి డా. లక్ష్మి సెహగల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సి రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా ఉండేది. ఆమె సోదరుడు "గోవింద స్వామినాథన్" మద్రాసు హైకోర్టులో పేరుమోసిన న్యాయవాది. ఆయన మద్రాసు రాష్ట్ర (తమిళనాడు) కు అటార్నీ జనరల్ బాధ్యతలు కూడా నిర్వహించారు. మృణాళిని భర్త భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్ కాగా, భారతీయ అంతరిక్ష కార్యక్రమ పిత విక్రం సారాభాయ్ తన భార్యకు తన కెరీర్ ను పెంపొందించు కునేందుకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. వారికి ఒక కుమారుడు కార్తికేయ సారాభాయ్, ఒక కుమార్తె మల్లికా సారాభాయ్ ఉన్నారు. కుమార్తె మల్లిక కూడా నృత్య కళాకారిణియే. మృణాళిని అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2016, జనవరి 21న మరణించారు.

# మున్నేరు జల దోపిడీ ఆపాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** అత్యంత కీలకమైన మున్నేరు పరీవాహక ప్రాంత రైతాంగ ప్రయోజనాలను ప్రక్కన బెట్టి, 5వ షెడ్యూల్ ప్రాంతాల హక్కులు, పెసా (ఖఖాం) చట్టం ఉల్లంఘిస్తూ 10 టిఎంసిల మున్నేరు జలాలను మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ ద్వారా రెండు పంటలు పుష్కలంగా పండుతూ నాగార్జునసాగర్ ఆయకట్టుగా వున్న పాలేరు చెరువుకు తరలించడం అన్యాయం, అక్రమం. మున్నేరు నీరు ఆ ప్రాంత ప్రజల జీవనాధారం. చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రాజెక్టులు చేపడితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం నుండి ప్రవహిస్తూన్న మున్నేరుపై దుబ్బగూడెంమద్దివంచ గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్‌నుండి మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ (గ్రావిటీ కాలువ) ప్రారంభించబడి గార్ల మండలంలోని బుద్ధారం సమీపంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాల్వకు అనుసంధానం చేయడం ద్వారా పాలేరు చెరువుకు 10 టిఎంసిల నీటిని తరలించనున్నారు. మే 17, 2025న మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి 162.54 కోట్ల రూపాయల నిధులు మంజూరి చేస్తూ జీవో నెంబర్ 98ని ఖమ్మం జిల్లా మంత్రుల ప్రమేయంతో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మున్నేరు–పాలేరు లింకు కెనాల్ నిర్మాణం కోసం గార్ల మండలంలో 9.5 కిలోమీటర్ల పొడవున భారీ కాలువ తవ్వనున్నారు. ఈ కాలువ క్రింద చిన్న సన్నకారు పేద గిరిజన రైతులు 350 ఎకరాల వ్యవసాయ సాగు భూములను కోల్పోనున్నారు. ఒక చుక్క నీరు కూడా మున్నేరు పరీవాహక ప్రాంత రైతాంగానికి ఇవ్వడం లేదు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం నియోజిక వర్గాలలో 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగునీరు అందించాల్సిన మున్నేరు పప్రాజెక్ట్‌ను 60 సంవత్సరాలుగా ప్రభుత్వాలు

చారిత్రక నిర్లక్ష్యం చేస్తూన్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 131.67 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ తేది 24 జూన్ 2009న జీవో నెంబర్ 1076ను విడుదల చేసింది, కానీ మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాన్ని సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టులో కలుపుతూ కెసిఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వార్థ పూరిత రాజకీయ ప్రయోజనాలకు సీత రామ ప్రాజెక్ట్ బలిపశువుగా మారి మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతానికి సీతారామ జలాలు రాకుండా పోయాయి. సీత రామ ప్రాజెక్ట్ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దాల్సి వుండగా, అదే తప్పిదాన్ని యథాతథంగా కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యానికి, తెలితక్కువ తనాన్ని తేటతెల్లం చేస్తుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలంలో నిర్మించనున్నమున్నేరు పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా పాలేరులో వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మున్నేరు ప్రాజెక్టు, మున్నేరుపాలేరు లింక్ కెనాల్, తదితర నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ఆయా ప్రాంతాల నీటి అవసరాలను, చారిత్రక , భౌతిక, వాస్తవిక అంశాలను వెల్లడించకుండా ఖమ్మం జిల్లా మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ ప్రాజెక్ట్‌ల పట్ల

ఖమ్మం జిల్లా మంత్రుల వైఖరిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. వ్యతిరేకతలు, అభ్యంతరాలు ఉన్నప్పటికీ మున్నేరుపాలేరు లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది. మున్నేరు నదిపై మున్నేరు ప్రాజెక్ట్ (మున్నేరు రిజర్వాయర్) కడితే గార్ల, బయ్యారం మండలాల్లోని వేల ఎకరాలకు నీరు అందుతుంది. కానీ ఆ పనులు పక్కన పెట్టి కేవలం తరలింపు కెనాల్‌పై దృష్టి

పెట్టడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ఎండగాడుతూ స్థానిక ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజాభీష్టం మేరకు మున్నేరు – పాలేరు లింక్ కెనాల్‌ను విరమించుకుంటూ మున్నేరు – పాలేరు లింక్ కెనాల్, నిర్మాణం కోసం ఇచ్చిన జిఒను రద్దు చేసి ప్రభుత్వం తన విజ్ఞతను చాటాలి. మున్నేరు నీటిపై ఆ ప్రాంత ప్రజలకు ఉన్న సహజ సిద్ధమైన హక్కులను కాపాడుకోవడానికి న్యాయ పోరాటంతోపాటు ప్రజాపోరాటం చాలా అవసరం. మున్నేరు– పాలేరు లింక్ కెనాల్ కంటే మున్నేరు ప్రాజెక్టు నిర్మాణమే ఆ ప్రాంత సుస్థిర అభివృద్ధికి ఏకైక మార్గం

# మధ్యతరగతికి బడ్జెట్ ధమాకా.. రూ.15 లక్షల వరకు నో ట్యాక్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని కోట్ల మంది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు, ముఖ్యంగా వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. రాబోయే బడ్జెట్ 2026–27లో కొత్త పన్ను విధానం కింద ఆదాయపు పన్ను రాయితీలను భారీగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 87ఏ కింద ఇచ్చే పన్ను రిబేటు పరిమితిని ప్రస్తుతం ఉన్న దానికంటే గణనీయంగా పెంచి దాదాపు రూ. 1.5 లక్షల వరకు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత నిబంధనల ప్రకారం కొత్త పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేటు లభిస్తోంది (గతంలో ఇది రూ. 7 లక్షలుగా ఉండేది). అయితే, రాబోయే బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పరిమితిని మరింత విస్తరించాలని భావిస్తోంది. సెక్షన్ 87ఏ రిబేట్ కారణంగా రూ. 12 లక్షల ఆదాయం వరకు ఎలాంటి ట్యాక్స్ పడడం లేదు. అయితే సెక్షన్ 87ఏ రిబేటును పెంచడం ద్వారా, రూ. 15 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న ఉద్యోగులు కూడా ఎటువంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేని పరిస్థితి కల్పించనున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు కేవలం 87ఏ రిబేటు మాత్రమే కాకుండా, స్టాండర్డ్ డిడక్షన్ కూడా తోడవుతుంది. ఇప్పటికే ఈ పరిమితిని రూ. 75,000కు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 87ఏరిబేటు కూడా పెరిగితే రూ. 15 లక్షల ప్యాకేజీ ఉన్న సామాన్య ఉద్యోగి చేతికి పూర్తి జీతం అందే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రజల వద్ద ఖర్చు చేయడానికి ఎక్కువ నగదు మిగులుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోందట. పన్ను నిపుణులు, ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం.. ప్రభుత్వం పాత పన్ను విధానం కంటే కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్షన్ 87ఏ రిబేటు పెంపునకు బదులుగా పన్ను లెక్కలు చాలా సరళంగా మార్చవచ్చని అంచనా వేస్తున్నారు. గత ఏడాది బడ్జెట్‌లోనే సెక్షన్ 87ఏ రిబేట్ భారీగా పెంచారు. దీంతో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.12 లక్షలకు చేరింది.

దీంతో ఈసారి ఈ పరిమితిని పెంచకపోవచ్చంటున్నారు. అయితే, కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేందుకు రిబేట్ పెంచే అవకాశం లేకపోలేదంటున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరట లభిస్తుంది. ప్రజల చేతుల్లో డబ్బు ఎక్కువగా ఉంటే, మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు పెరిగి డిమాండ్ పెరుగుతుంది. వచ్చే ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే ఈ బడ్జెట్ పై సామాన్యుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం ఈ సెక్షన్ 87ఏ రిబేటును రూ. 1.5 లక్షలకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే, భారత పన్ను చరిత్రలో ఇది ఒక విప్లవాత్మక మార్పుగా నిలుస్తుంది. పన్నుల భారం తగ్గుతుందన్న వార్తతో దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, ప్రైవేటు రంగ కార్మికులు హర్షం వ్యక్తం చేయనున్నారు.

## భారత ఈవీ పథకాలపై చైనా అక్కసు



**హైదరాబాద్ పెన్ పవర్:** మరోసారి భారత్‌తో చైనా తగువుకు దిగింది. ముఖ్యంగా మన దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకొచ్చిన పథకాలపై చైనా అక్కసు వెళ్లగక్కుతోంది. ద్వైపాక్షిక సంప్రదింపులు విఫలమైన తర్వాత, ఆటోమొబైల్స్, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల కోసం భారత ప్రభుత్వం అందించే ప్రోత్సాహక పథకాలకు వ్యతిరేకంగా వివాద పరిష్కార ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)ను కోరడం ద్వారా చైనా భారత్‌తో తన వాణిజ్య వివాదాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేసింది. 2025, నవంబర్ 25, 2026, జనవరి 6న జరిగిన సంప్రదింపుల్లో ఎలాంటి నిర్ణయం ఖరారు కాలేదని, ఫలితంగా ఒక ప్యానెల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ప్రపంచ వాణిజ్య సంస్థకు పంపిన ఓ ప్రకటనలో చైనా తెలిపింది. దీనిపై జనవరి 27న జెనీవాలో జరిగే తదుపరి డబ్ల్యూటీఓ సమావేశంలో చర్చ ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రధానంగా, ఈ వివాదం భారత ప్రభుత్వం తెచ్చిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకం గురించి. ఈ పథకం భారత్‌లో తయారు చేసిన వస్తువులకు అనుకూలంగా ఉన్నాయని, చైనా ఉత్పత్తులు పోటీ పడేందుకు అడ్డంకిగా ఉన్నాయని చైనా చెబుతోంది. ఇది ప్రపంచ వాణిజ్య నియమాల ఉల్లంఘన అని, తమ కంపెనీలపై వివక్ష చూపడమేనని చైనా అంటోంది. భారత విధానాలు సబ్సిడీలు, వాణిజ్యం, పెట్టుబడి నిబంధనలపై డబ్ల్యూటీఓ ఒప్పందాలకు విరుద్ధంగా ఉన్నాయని చైనా వాదిస్తోంది. ఇది పీఎల్ఐ పథకం మాత్రమే కాదు, అధునాతన బ్యాటరీ స్టోరేజ్ పథకం, భారత్‌లో ఈవీల తయారీని ప్రోత్సహించే విధానాలతో సహా అనేక కార్యక్రమాలను చైనా పేర్కొంది.

## ఆకాశాన్నంటిన పసిడి, వెండి ధరలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో కొనుగోలుదారులు విస్మయానికి గురవుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు మరియు దేశీయ డిమాండ్ పెరగడం వల్ల ఈ భారీ పెరుగుదల నమోదైనట్లు మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఈ ధరల పెంపు పెద్ద షాక్‌గా మారింది, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ మార్పులు ఇన్వెస్టర్లలో కూడా చర్చనీయాంశమయ్యాయి. వెండి ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీ జంప్‌ను నమోదు చేశాయి. ఒక్క రోజులోనే కేజీ వెండి ధరపై ఏకంగా రూ.12,000 అదనంగా పెరగడంతో, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,30,000 మార్కును తాకింది. సాధారణంగా వెండి ధరల్లో స్వల్ప మార్పులే కనిపిస్తుంటాయి, కానీ ఈ స్థాయి భారీ పెరుగుదల పరిశ్రమ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పారిశ్రామిక అవసరాలు మరియు వెండిపై పెట్టుబడులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. బంగారం ధరల విషయానికి వస్తే, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు రూ.1,040 పెరగడంతో ఇప్పుడు దీని ధర రూ.1,47,280 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.950 ఎగబాకి, రూ.1,35,000 మార్కుకు చేరుకుంది. పసిడి ప్రేమికులకు ఇది మింగుడుపడని వార్తే అయినప్పటికీ, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ధరలు ఎక్కడా తగ్గే సూచనలు కనిపించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. రవాణా ఖర్చులు మరియు స్థానిక పన్నుల కారణంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ధరలు కొద్దిపాటి వ్యత్యాసంతో కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## బిలీయనీర్ల సంపద రూ. 1,660 లక్షల కోట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన లీడర్లు, ఆర్థికవేత్తలు, బిలియనీర్లు ఈ ఏడాది వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సమావేశం కోసం దావోస్‌కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తన కొత్త నివేదికలో పలు కీలక విషయాలను వెల్లడించింది. దాని ప్రకారం, ప్రపంచ సంపద అసమానత అత్యంత ప్రమాదకరమైన కొత్త దశలోకి ప్రవేశించిందని, సంపద మునుపెన్నడూ లేనంత వేగంగా పెరగడమే కాకుండా, అది రాజకీయ శక్తిగా కూడా వేగంగా మారుతోందని తెలిపింది. సాధారణ ప్రజలతో పోలిస్తే బిలియనీర్లు రాజకీయ పదవులు చేపట్టే అవకాశాలు ఇప్పుడు 4,000 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యాలకు తీవ్ర అస్థిరతను కలిగిస్తాయని ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది. అదే సమయంలో, ప్రపంచ బిలియనీర్ల మొత్తం సంపద 2025లో రికార్డు స్థాయిలో 18.3 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది, ఇది గత ఐదేళ్ల సగటు వేగం కంటే మూడు రెట్లు వేగంగా పెరిగింది. మన కరెన్సీలో చెప్పాలంటే, ఈ మొత్తం రూ. 1,660 లక్షల కోట్లకు పైగా ఉంటుంది. ఈ మొత్తం చాలా దేశాల స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే చాలా ఎక్కువ. ఈ సందర్భంగా ధనవంతులు చాలా శక్తివంతులుగా మారుతున్నారని ఆక్స్‌ఫామ్ హెచ్చరిస్తోంది. బిలియనీర్లు చాలా వేగంగా ధనవంతులుగా, మరింత శక్తివంతులుగా మారుతున్నారు. వారి సంపద ఒక సంవత్సరంలో 16 శాతం, 2020 నుంచి 81 శాతం పెరిగింది. స్టాక్ మార్కెట్లు, ఏఐ కంపెనీలు, వారికి అనుకూలంగా ఉండే పాలసీలు ధనవంతులకు కలిసొచ్చింది. కేవలం ఒక ఏడాది వ్యవధిలో బిలియనీర్లు 2.5 ట్రిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 227.19 లక్షల కోట్లు) సంపాదించారు, ఇది ప్రపంచ జనాభాలో సగం మంది సంపదకు సమానం. ఈ సంపదను ఉపయోగించి తీవ్ర పేదరికాన్ని అనేక రెట్లు అంతం చేయవచ్చని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.

## భారత వృద్ధి అంచనాలను పెంచిన మూడీస్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.3 శాతం వృద్ధిని సాధిస్తుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. కంపెనీలు పెట్టుబడులు పెట్టడం దగ్గరి నుంచి ఎక్కువ మందికి ఉపాధి లభించడం, ఆదాయాలు పెరగడం, ప్రజలు ఖర్చు చేసే ధోరణి సానుకూలంగా ఉండటం, బీమా రక్షణకు డిమాండ్‌ను పెరగడం వంటి అంశాలు మొత్తం దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయని మూడీస్ అభిప్రాయపడింది. అంతేకాకుండా దేశంలో వేగంగా పెరుగుతున్న డిజిటల్ వినియోగం, ప్రభుత్వం చేపడుతున్న పన్ను, బీమా రంగ సంస్కరణలు దోహదపడుతున్నాయి. ఇదే సమయంలో భారత్‌కు ఎగుమతుల నుంచి మాత్రమే వృద్ధికి మద్దతు లభించడం లేదు, దేశీయ డిమాండ్ వృద్ధికి ప్రధాన కారణమని నివేదిక వెల్లడించింది. గతేడాదిలో 6.5 శాతం నుంచి ఈసారి 7.3 శాతం భారత వృద్ధి ఉంటుందని భావిస్తున్నాం. అధిక వృద్ధి కొనసాగడం వల్ల దేశంలో సగటు ఆదాయం పెరుగుతుంది. ఎక్కువ మంది ఆరోగ్యం, జీవితం, పొదుపు కోసం బీమా పాలసీలను కొనవచ్చని తెలిపింది. ఫలితంగా రానున్న రోజుల్లో దేశ బీమా రంగం ఎక్కువ ప్రయోజనం పొందనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఎనిమిది నెలలు మొత్తం బీమా ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ. 10.9 లక్షల కోట్లకు చేరింది. ఆరోగ్య బీమా ప్రీమియంలు 14 శాతం, కొత్త జీవిత బీమా వ్యాపారం 20 శాతం పెరగడమే ఇందుకు కారణం. దేశంలో బీమాకు డిమాండ్ పెరుగుతోంది. ప్రజలు ఆరోగ్యం, ఆర్థిక నష్టాల గురించి ఎక్కువ అవగాహన ఆశిస్తున్నారు. డిజిటలైజేషన్ బీమా కొనుగోలును సులభతరం, వేగవంతం చేసిందని నివేదిక పేర్కొంది.

# భిన్నత్వంలో ఏకత్వమే భారత్ లక్షణం

**హైదరాబాద్ పెన్ పవర్:** సువిశాల భారతం విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాల సమ్మేళనం, భిన్నత్వంలో ఏకత్వమే భరతమాత విలక్షణత. భాషలు, యాసలు, కులమతాలు, జీవన విధానాలు, సామాజిక ఒడుదుడుకులు, సంస్కృతికి విలక్షణతలు వేరైనా ఒకే దేశంగా సగర్వంగా నిలబడిన ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశం నా సుందర హిందూస్థానం. బ్రిటీష్ వలస పాలన నుంచి 1947లో విముక్తమై, స్వతంత్ర భారతంగా ఊపిరి పీల్చుకున్న సమయంలో నాడు 565 రాజరిక రాష్ట్రాలు లేదా ప్రిన్సిలీ స్టేట్స్‌తో పాటు 14 రాష్ట్రాలు, 7 ప్రావిన్సులు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉండేవి. నేటి భారత దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రకాల్తో ప్రాంతాలుగా తన మనుగడను కొనసాగిస్తున్నది. గత 79 ఏండ్లలో సమయానుకూలంగా, స్థానిక అవసరాలు, భాష ప్రాతిపదికలు, పాలన సౌలభ్యాలు, ప్రజాభిప్రాయాలను బట్టి ప్రిన్సిలీ స్టేట్స్, ప్రావిన్సులను విలీనం చేసుకొని, మరో 14 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం లేదా విస్తరించడం జరిగింది. ఇదే క్రమంలో 21 జనవరి 1972న ఈశాన్య ప్రాంతాలైన త్రిపుర, మణిపూర్, మేఘాలయాలను రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడానికి “ఈశాన్య ప్రాంతాల పునర్వ్యవస్థీకరణ చట్టం, 1971” చేయడం, 27వ రాజ్యాంగ సవరణ చేయడంతో ఈ మూడు రాష్ట్రాలు ఆవిర్భవించాయి. 1947లో మహారాజా ఆఫ్ మణిపూర్ పాలనలో ఉన్న మణిపూర్, స్వతంత్రం రాగానే భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించడం, 1948లో రాజ్యాంగ రాచరికంలో ఏలుబడి జరిగి, 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. 1956లో కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించబడి, 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయబడింది. ఇంఫాల్ రాజధానిగా 37.56 లక్షల జనాభా కలిగిన మణిపూర్ నేడు కొండ ప్రాంత కుకీలు, లోయ ప్రాంత మైథీల మధ్య విభేదాలతో ఉద్రిక్తతల నడుమ ఒకే రాష్ట్రంగా కొనసాగుతున్నది. తనకంటూ ఒక ప్రత్యేక సంస్కృతి వారసత్వ సంపదలతో మణిపురీ నాట్యం, విలక్షణ పండుగలతో విరాజిల్లుతున్నది. 1947లో రాచరిక పాలనలో ఉన్న త్రిపుర ప్రాంతం కంచన్ ప్రభ రాణి చొరవతో 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. ఒకప్పుడు మనీషా రాజవంశం పాలించిన త్రిపుర ప్రాంతం 1956లో కేంద్ర పాలిట ప్రాంతంగా, 1972లో రాష్ట్రంగా పునర్వ్యవస్థీకరించబడింది. అగర్తలా కేంద్రంగా పాలన కొనసాగుతున్న త్రిపుర రాష్ట్ర జనాభా నేడు దాదాపు 43 లక్షలు ఉన్నది. 1947లో మేఘాలయా ప్రాంతం ‘ఘోర – ఖాసీ’ల ఏలుబడిలో ఉన్నది. 1970లో ఈ ప్రాంతం అస్సామ్‌లో భాగంగా ఉన్నప్పటికీ 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తన ప్రత్యేకతను నిలుపుకుంది. “మేఘాల నిలయం”గా పేరొందిన మేఘాలయా ప్రాంత సహజ ప్రకృతి అందాలు, ప్రత్యేక సాంస్కృతిక సంపదలతో తన విలక్షణతలు నిలుపుకుంటున్నది. ‘స్కాట్‌లాండ్ ఆఫ్ ఈస్ట్’గా పిలువబడే షిల్లాంగ్ కేంద్రంగా పాలన కొనసాగుతున్న మేఘాలయాలో నేడు 39.2 లక్షల జనాభా ఉన్నది. ఈశాన్య భారతంలో ప్రకృతి అందాలు, కొండలు కోనలు, లోయల సహజ సంపదలతో విరాజిల్లుతున్న త్రిపుర, మణిపూర్, మేఘాలయా రాష్ట్రాలు 21 జనవరి 2025న తమ తమ “రాష్ట్ర అవతరణ దినోత్సవాల”ను ఘనంగా జరుపుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధికి మరోసారి ప్రజలు పునరంకితులు కావాలని కోరుకుందాం. ఈశాన్య భారత అందాలను ఇనుమడింప జేస్తున్న ఈ రాష్ట్రాల్లో శాంతి, సంపదలు రాజ్యమేలాలని ఆశిద్దాం.

# హాస్యరస చిత్ర దర్శకుడు ఇవివి

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్‌లో అత్యంత విజయవంతమైన దర్శకుడిగా ఇ.వి.వి సత్యనారాయణ నిలిచాడు. అతను 80, 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్రరావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందుకున్నాడు ఇ.వి.వి.. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఇ.వి.వి. చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్‌లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చారు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవారు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఇ.వి.వి సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వారట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఇ.వి.వి సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఇ.వి.వి తన మొదటి సినిమా ఇ.వి.వి రాజేంద్రప్రసాద్‌ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని? గోదావరిలో దూకిచావాలని అనుకున్నారట. ఓసారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయారట. తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు ‘ప్రేమఖైది’ అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి? అంటూ ఆయన చిన్నకొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది. ఇ.వి.విగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 – జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హస్యాన్ని చిత్రాల్లో ప్రవేశపెట్టాడు. రాజేంద్రప్రసాద్‌తో ఆ ఒక్కటిఅడక్కు, అప్పులఅప్పారావు, ఆలీబాబా అరడజనుదొంగలు వంటి చిత్రాలు, నరేష్తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళాపరమైన చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశాడు. తర్వాత కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశాడు. సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్‌కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయన ను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయ వలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలను కున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బరాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణంరాజును

కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీరంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్యగలవు అని అడిగాడు. సహాయ దర్శకున్ని అవుతానని చెప్పిన ఇ.వి.విని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం కల్పించాడు.

# దళిత సాహిత్యోద్యమ రథసారథి

**హైదరాబాద్ పెన్ పవర్:** పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తిలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యు లు, తెలుగు అకాడమీ సభ్యు లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తిలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పి. హెచ్.డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు. 1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచురించే ‘వాజ్మయి’ సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం,

కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు. దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ దర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి “మిళినీద” కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు,

డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం – కరీంనగర్ , నేదురుమల్లి జనార్దన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాదే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు. 28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 63వ పుట్టిన రోజు తర్వాత వారం రోజుల కే ఈ లోకాన్ని వదిలి వెళతారని ఎవరూ హిస్తారు. సుధాకర్ ఆకస్మిక అకాల మరణం ఆధునిక తెలుగు సాహిత్యానికి తీరని లోటు.

# పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 2025-26 అక్టోబరు-డిసెంబరులో రూ.5,100 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. 2024-25 ఇదే కాల లాభం రూ.4,508 కోట్లతో పోలిస్తే ఇది 13% అధికం. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.31,340 కోట్ల నుంచి రూ.32,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ.11,032 కోట్ల నుంచి 4.5% తగ్గి రూ.10,533 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ లాభం రూ.6,621 కోట్ల నుంచి రూ.7,481 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి మెరుగయ్యాయి. అయినా కేటాయింపులు రూ.318 కోట్ల నుంచి రూ.1,341 కోట్లకు పెరిగాయి. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈసీఎల్ (ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను చేరుకోవడానికి రూ.955 కోట్ల అదనపు కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఇకపై ప్రతి త్రైమాసికంలో రూ.5,000 కోట్ల నికర లాభం లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన ఒక పెద్ద ఖాతా నుంచి భారీ మొత్తం వసూలు కావడంతో రికవరీ రూ.823 కోట్ల నుంచి రూ.1,956 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. వొడాఫోన్ ఐడియాకు గతంలో మంజూరు చేసిన రూ.300 కోట్ల రుణం బకాయిలుగా ఉందని, ప్రస్తుతం ఆ సంస్థకు కొత్తగా రుణాలు మంజూరు చేయలేదని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.8-2.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు.

# ప్రోటీన్ లోపం షుగర్ వస్తుందంట..



**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి సరైన పోషకాలు అవసరం. సమతుల్య ఆహారం తీసుకుంటేనే సరైన పోషకాలు లభిస్తాయి. శరీరంలో ఏ ఒక్క పోషకం తగ్గినా అనేక సమస్యలు వస్తాయి. అలాంటి పోషకాల్లో ఒకటి ప్రోటీన్. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ప్రోటీన్ మన శరీర నిర్మాణానికి అవసరమైన పదార్థం. కండరాల్ని నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి.. హార్మోన్లు, ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయడానికి, రోగనిరోధక శక్తిని బలంగా ఉంచడానికి ప్రోటీన్ చాలా అవసరం. అందుకే నిపుణులు ఎల్లప్పుడూ ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తారు. అయితే ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. శరీరంలోని కొన్ని సమస్యలు ప్రోటీన్ లోపాన్ని సూచిస్తాయని వివరిస్తూ డాక్టర్ సాకేత్ గోయల్ ఇన్స్టాగ్రామ్ వీడియోను పోస్ట్ చేశారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. భారతదేశంలోని ప్రతి వ్యక్తికి వారి ఆహారంలో 30 నుంచి 50 శాతం ప్రోటీన్ లోపం ఉంది. ఇది పరిష్కరించడం చాలా ముఖ్యం. ప్రతి వ్యక్తి శరీర బరువులో కిలోగ్రాముకు ఒక గ్రాము ప్రోటీన్ అవసరం. దీని అర్థం ఎవరైనా 70 కిలోగ్రాముల బరువు ఉంటే, వారికి రోజుకు సుమారు 70 గ్రాముల ప్రోటీన్ అవసరం.అథ్లెట్లు, బాడీబిల్డర్లు లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి, ఈ మొత్తం ఇంకా ఎక్కువగా ఉండవచ్చు. తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల బలహీనత, కండరాల నష్టం, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేసేవారికి ఎక్కువ ప్రోటీన్ అవసరం. ఇంకా, 50 ఏళ్లు పైబడిన వారు కూడా ప్రతిరోజూ శరీర బరువులో ప్రతి పౌండ్‌కి 1.2 నుంచి 1.5 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలని డాక్టర్ సాకేత్ గోయల్ వివరించారు. దీని అర్థం వారికి 90-100 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఈ అవసరం తీర్చడం కష్టం. ఇది శరీరంలో ప్రోటీన్ లోపానికి దారితీస్తుంది. శరీరంలో ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాల బలహీనత ఏర్పడుతుంది. ఇది సార్కోపెనియాకు దారితీస్తుంది. ఇక్కడే వయస్సు పెరిగే కొద్దీ కండర ద్రవ్యరాశి తగ్గుతుంది. నిలబడే సామర్థ్యం తగ్గుతుంది. శరీర బలం తగ్గుతుంది. గాయాల ప్రమాదాన్ని పెంచుతుంది.ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాలు మాత్రమే కాకుండా ఎముకలు కూడా బలహీనపడతాయి. గాయాల సమయంలో ఎముకలు విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ప్రోటీన్ లోపం వల్ల తరచుగా అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్లు వస్తాయి. శరీరం యొక్క రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే ఈ సమస్యలు వస్తాయి.శరీరం యొక్క రక్షణ విధానాలు మందగిస్తాయని డాక్టర్ చెబుతున్నారు. దీని వల్ల గాయాలు, ఆపరేషన్ చేసిన తర్వాత కోలుకోవడం కష్టమవుతుంది. ఈ కారణాలన్నింటికీ ప్రోటీన్ లోపం కారణం.ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో వాపు వస్తుంది. శరీర నొప్పులు అలాగే ఉంటాయి. అంతేకాకుండా శరీరం బలహీనంగా ఉంటుంది. ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ అంటున్నారు.

# ఫ్యాట్‌ని పెంచని ఫుడ్స్ కడుపు నిండా తిన్నా సన్నగానే ఉంటారు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆహారం తినకుండా బరువు తగ్గడం సరైంది కాదు. సగం కడుపు మాడ్చుకుని తినడం కూడా మంచిది కాదు. ఎందుకంటే, అలాంటి డైట్‌పై ఓసారి కాకపోయినా మరోసారి విరక్తి వచ్చేసి ఆ డైట్‌నే మార్చేస్తారు. మళ్ళీ మొదటికొస్తారు. అందుకే, మంచి డైట్‌ని ముందుగా సెలక్ట్ చేసుకోవాలి. ఆ డైట్ ప్రకారమే తింటే కడుపు నిండుగా ఉంటుంది. దీంతో ఫ్యాట్ లాస్ అవుతారు. వెయిట్‌లాస్ కూడా అవుతారు. కోడిగుడ్లు అందరికీ అందుబాటులో ఉండే బెస్ట్ ప్రోటీన్ సోర్స్. రోజూ వీటిని డైట్‌లో యాడ్ చేయడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. ఇందులో ప్రోటీన్‌తో పాటు ఫ్యాట్, ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి ఎంతో మంచివి. ఉడకబెట్టుకుని తింటే వెయిట్‌మేనేజ్‌మెంట్‌లో చక్కగా హెల్ప్ చేస్తాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి పర్ఫెక్ట్ ఛాయిస్. అలానే పాప్‌కార్న్. ఇది కూడా మంచి ఫైబర్ ఫుడ్. వీటిని చాలా మంది టైంపాస్‌కి తింటుంటారు. కానీ, అలా కాకుండా, చక్కగా వీటిని కడుపుని నింపే ఫుడ్స్ అని చెప్పొచ్చు. చాలా టేస్టీగా ఉంటాయి. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ఫుడ్ కూడా కాదు. కాబట్టి, చక్కగా తినొచ్చు. రుచికి రుచి. బరువు కూడా తగ్గుతారు. పెసరపప్పు కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని తినడం వల్ల ఒంటికి చలువ. పైగా పప్పులో ఎన్నో పోషకాలు ఉంటాయి. ప్రోటీన్, లిపిడ్స్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, కాల్షియం, ఐరన్, సోడియంలు ఎక్కువగా ఉంటాయి. వీటిని మీరు ఎలా అయినా తీసుకోవచ్చు. అదే విధంగా మొక్కజొన్న. మొక్కజొన్నలో కూడా ప్రోటీన్, లిపిడ్ ఫ్యాట్, కార్బోహైడ్రేట్స్, ఎనర్జీ, పంచదార శాతం ఎక్కువగా ఉంటాయి. వీటిని చక్కగా ఉడికించి, వేయించి ఎలా అయినా తీసుకోవచ్చు. దోసకాయ, సోరకాయల్లో కూడా నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. కేలరీలు తక్కువగా, నీటిశాతం ఎక్కువగా ఉండే కూరగాయల్లో ఇవి ఒకటి. దోసకాయల్ని మనం సలాడ్స్, నేరుగానైనా తీసుకోవచ్చు. అదే విధంగా, సోరకాయని మీరు పప్పు, కూరలు, ఎలా అయినా వండుకుని తినొచ్చు. వీటి వల్ల పోషకాలు అందుతాయి. కడుపు నిండుతుంది. ఫ్యాట్‌లాస్ అవ్వడానికి ఎక్కువగా హెల్ప్ అవుతుంది. క్యాబేజీ, క్యారెట్స్‌లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. క్యాబేజీలో విటమిన్ కె, సి,ఫైబర్, ఫోలేట్, బి విటమిన్స్, మినరల్స్, పొటాషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా మన జీర్ణశక్తి, ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాకుండా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీర కణాలను డ్యామేజ్ కాకుండా చేస్తాయి. ఫ్యాట్ పెరగకుండా చేస్తాయి. ఇక క్యారెట్స్‌లో బీటా కెరోటిన్, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవన్నీ కంటి ఆరోగ్యాన్ని, జీర్ణ ఆరోగ్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. వీటిలోని నీటిశాతం కడుపు నిండేలా చేస్తుంది. వీటిని హెల్దీ స్నాక్స్‌గా మనం కన్సిడర్ చేయొచ్చు. బొప్పాయి పండు కూడా ఎంతో టేస్టీగా ఉండే పండు. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. పైగా నీటిశాతం ఎక్కువగా ఉండి విటమిన్స్, ఫైబర్, పొటాషియం, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్స్, లైకోపీన్‌లు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ, జీర్ణ శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. శనగలు కూడా మంచి గ్రెయిన్. ఇందులో ప్రోటీన్, ఫైబర్, కాంప్లెక్స్ కార్బ్స్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉన్నాయి. వీటిని మనం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేయడమే కాకుండా, కండరాలకి కూడా మంచిది.

# గాఢ నిద్రలో అకస్మాత్తుగా మేల్కొంటున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాత్రిపూట తరచుగా మేల్కొంటుంటే, దానిని తేలికగా తీసుకోకండి. పడుకున్న తర్వాత 7 నుండి 8 గంటలు బాగా నిద్రపోవడం చాలా ముఖ్యం. అలా చేయకపోవడం మీ ఆరోగ్యానికి ప్రమాదకరం.. అయితే.. నిద్రలో అకస్మాత్తుతగా లేవడం.. నిద్రలేమి.. గుండె ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మంచి ఆరోగ్యానికి తగినంత నిద్ర చాలా ముఖ్యం. కానీ రాత్రిపూట మీకు తరచుగా అంతరాయం కలిగిస్తుంటే, దానిని సాధారణ సమస్యగా తోసిపుచ్చకండి. నిద్రలో తరచూ మేల్కొనడం.. అంతరాయం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు.. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన కొత్త పరిశోధన ప్రకారం.. తరచుగా అంతరాయాలు గుండె ఆరోగ్యానికి తీవ్రమైన పరిణామాలను కలిగిస్తాయి. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, అది అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. పరిశోధన ప్రకారం, ప్రతి ఒక్కరూ రాత్రికి కనీసం 7 నుండి 8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యం. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, తరచుగా నిద్రకు అంతరాయాన్ని ఎదుర్కొనే వ్యక్తులు అధిక రక్తపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. నిద్రకు అంతరాయం కలిగించేవి శరీరం పూర్తిగా మరమ్మత్తు చేయకుండా నిరోధిస్తాయి.. ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. తరచుగా నిద్రకు అంతరాయం కలిగించేవి మెదడుపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. రాత్రిపూట గాఢ నిద్రలో అనేక అవయవాలు విశ్రాంతి పొందడంతోపాటు.. రిపేర్ అవుతుంటాయి. గుండె విశ్రాంతి తీసుకుంటుంది.. రక్తపోటు సాధారణంగా ఉంటుంది. కానీ నిద్రకు పదేపదే అంతరాయం కలిగితే, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది వాపునకు కారణమవుతుంది. ఇంకా ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. రోజుకు 23 అంతరాయాలను నివేదించే వ్యక్తులకు గుండె జబ్బుల ప్రమాదం 30 శాతం పెరుగుతుంది. మానసిక ఒత్తిడి స్పష్టంగా గుండెను ప్రభావితం చేస్తుంది. అందువల్ల, మీరు తరచుగా రాత్రిపూట మేల్కొలుపులు ఎదుర్కొంటుంటే మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా కొంతమంది చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంకా తక్కువ నిద్రపోవడం వల్ల శరీరంలోని రక్త పోటు, గ్లూకోజ్ మెటబాలిజం, వాపు వంటి జీవ ప్రక్రియలకు భంగం కలుగుతుంది.

# జిడ్డు మరకలను వదిలించే అద్భుతమైన చిట్కాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా వంటగదిలో మనం నిత్యం వాడే వస్తువులు జిడ్డు పట్టడం సహజం. ముఖ్యంగా గ్యాస్ లైటర్లు నూనె జిడ్డుతో నల్లగా మారిపోతుంటాయి. అలాంటప్పుడు ఒక పొడి క్లాత్ తీసుకుని దానిపై కొంచెం లైజాల్, నిమ్మరసం, మరియు బేకింగ్ సోడా వేసి లైటర్‌ను బాగా తుడవాలి. ఇలా చేయడం వల్ల లైటర్‌పై ఉన్న మొండి జిడ్డు వదిలిపోవడమే కాకుండా, అది కొత్త దానిలా తళతళా మెరుస్తుంది.ఇక ఇంట్లోని ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులపై పడే నల్లటి వేలి ముద్రలు, మచ్చలు ఇంటి అందాన్ని తగ్గిస్తాయి. వీటిని శు భ్రం చేయడానికి నీటిని వాడటం ప్రమాదకరం కాబట్టి, నెయిల్ పాలిష్ రిమూవర్‌ను ఉపయోగించడం ఉత్తమమైన మార్గం. ఒక దూది ఉండను ద

తీసుకుని దానిపై కొంచెం క్లీనర్ వేసి స్విచ్ బోర్డులను తుడిస్తే, తక్కువ శ్రమతోనే మరకలు మాయమై స్విచ్ బోర్డులు శుభ్రంగా కనిపిస్తాయి. వాషింగ్ మెషిన్ లోపల లేదా బయట పేరుకుపోయే డిటర్జెంట్ మరకలు, నీటి చారలను తొలగించడానికి ఒక ప్రత్యేకమైన మిశ్రమం బాగా పనిచేస్తుంది. ఒక కప్పు వేడి నీటిని తీసుకుని అందులో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని మరకలు ఉన్న చోట స్ప్రే చేసి, ఒక పది నిమిషాల పాటు అలాగే వదిలేయాలి. ఆ తర్వాత క్లీనింగ్ బ్రష్‌తో మెల్లగా రుద్దితే ఎలాంటి మొండి మరకలైనా సులువుగా తొలగిపోతాయి.

పైన పేర్కొన్న

ఈ చిట్కాలను పాటించడం వల్ల ఖరీదైన క్లీనింగ్ కెమికల్స్ వాడాల్సిన అవసరం లేకుండానే ఇంట్లోని వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. ఇవి కేవలం సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, తక్కువ ఖర్చుతో ఇంటిని అందంగా మార్చుకోవడానికి సహాయపడతాయి. గృహిణులు తమ రోజువారీ పనుల్లో ఈ చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఇంటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు.

## బరువు తగ్గాలా..

## రాత్రి ఒక్క డ్రింక్ తాగి చూడండి



**హైదరాబాద్ పెన్ పవర్:** అధిక బరువు ఉంటే ఎన్నో సమస్యలొస్తాయి. కొలెస్ట్రాల్ పెరగడం దగ్గర్నుంచీ ఫ్యాటీ లివర్, గుండె సమస్యలు ఇలా ఎన్నో సమస్యలు వస్తాయి. అందుకే, అధికబరువుని తగ్గించుకోవాలి. దీనికోసం సరైన లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడంతో పాటు నేచురల్ చిట్కాలని ఫాలో అవ్వాలి. వీటితో మంచి రిజల్ట్ ఉంటుంది. అలాంటి ఓ టిప్ గురించి డాక్టర్ ఎరిక్ బర్గ్ యూట్యూబ్‌లో ఓ టిప్‌ని షేర్ చేశారు. దీంతో బెల్లీ ఫ్యాట్‌తో పాటు బరువు కూడా తగ్గుతారు. అయితే, డాక్టర్ చెప్పిన ఈ డ్రింక్ ఉదయం కంటే రాత్రుళ్ళు తాగడం మంచిది. దీంతో బాడీలోని కొలెస్ట్రాల్ చాలా వరకూ తగ్గుతుంది. కొన్నిసార్లు బరువు తగ్గడమంటే తక్కువ తినడం, వర్కౌట్ చేయడం మాత్రమే కాదు. బాడీలోని కొన్ని హార్మోన్స్ కూడా సరైన తీరుగా పనిచేయాలని డాక్టర్ ఎరిక్ బర్గ్ చెబుతున్నారు. ముఖ్యంగా, కార్టిసాల్ మరియు ఇన్సులిన్ వంటి హార్మోన్స్ పెరిగితే బాడీలో కొలెస్ట్రాల్ కరగదు. దీని వల్ల బరువు తగ్గరు. డాక్టర్ బెర్గ్ ప్రకారం, రాత్రుళ్ళు అధిక కార్టిసాల్ లెవల్స్‌ని కరగకుండా చేస్తాయి. కాబట్టి, బరువు తగ్గడానికి మంచి నిద్ర చాలా ముఖ్యం. దీనికోసం నిమ్మకాయ బామ్ టీ కూడా హెల్ప్ చేస్తుంది. నిద్రపోవడానికి కనీసం గంట ముందు ఓ కప్పు నిమ్మ బామ్ టీ తాగితే బాడీ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. నిద్ర మెరుగవుతుంది. మంచి నిద్ర ఉంటే చాలు. సహజంగా కొవ్వు కరుగుతుంది. ఈ టిప్ చక్కగా పనిచేయాలంటే కొద్దిగా మెగ్నీషియం గ్లైసినేట్ పౌడర్ వేయాలి. ఇది కండరాలని సడలించడానికి, శరీరాన్ని ప్రశాంతపరచడానికి, ఇన్సులిన్, కార్టిసాల్‌ని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. నేచురల్‌గానే బరువు తగ్గేందుకు ఈ టిప్ హెల్ప్ అవుతుంది. ఒత్తిడి, హార్మోన్లు నియంత్రణలో ఉన్నప్పుడు బరువు తగ్గడం ఈజీ. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ తగ్గడం ఈజీ. ప్రతీ వ్యక్తి బాడీటైప్ వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి, ఏదైనా డ్రింక్స్, టిప్స్ ఫాలో అయ్యేముందు డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వడం మంచిది.

# అల్లం, వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది?



**హైదరాబాద్ పెన్ పవర్:** కూర ఏదైనా సరే.. దానికి మంచి రుచి రావాలంటే.. ఉప్పు, కారాలతో పాటుగా తాజా అల్లం, వెల్లుల్లి, మసాలా ఉండాల్సిందే.. ఇక్కడ తాజా అల్లం వెల్లుల్లి పాత్ర అతి ముఖ్యమైనది. కూరలకు ఇది అదిరిపోయే రుచిని ఇస్తుంది. అందుకే ప్రతి ఒక్కరి వంటింట్లో తప్పనిసరిగా అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎప్పుడూ నిల్వ ఉంటుంది. అయితే, దీన్ని నిల్వ చేసేందుకు చాలా మంది ఫ్రిజ్‌లో పెడుతుంటారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా..? లేదా అనే దానిపై జనాల్లో అనేక సందేహాలు ఉన్నాయి. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల అవి విషపూరితంగా మారతాయనే పుకార్లు కూడా ఉన్నాయి. అయితే, నిపుణుల ప్రకారం, వీటిని ఫ్రిజ్‌లో ఉంచడం తప్పనిసరి కాదని అంటున్నారు. రిఫ్రిజిరేటర్ లేని రోజుల్లో కూడా అల్లం, వెల్లుల్లి నెలల తరబడి తాజాగా ఉండేవని చెప్పారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలలో నీటి శాతం తక్కువగా ఉంటుంది. వైద్యపరంగా, వాటిని నీరు లేని కూరగాయలు అని పిలుస్తారు. ఫ్రిజ్‌లోని చలి, తేమ వాటిలోని తేమను ఆకర్షిస్తాయి. దీనివల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. తేమతో కూడిన వాతావరణంలో బాక్టీరియా, శిలీంధ్రాలు త్వరగా పెరుగుతాయి. అందుకే ఫ్రిజ్‌లో నిల్వ చేసిన వస్తువులు కొన్నిసార్లు త్వరగా చెడిపోతాయి. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను బుట్టలో, మెష్ బాక్స్‌లో లేదా బహిరంగ ప్రదేశంలో నిల్వ చేయడం మంచిదని చెబుతున్నారు.. ఇది రుచి, నాణ్యతను కాపాడుతుంది. మీరు దానిని ఫ్రిజ్‌లో ఉంచితే అది విషపూరితం కాదు. కానీ మీరు దానిని తప్పుగా నిల్వ చేస్తే, అది త్వరగా చెడిపోతుంది. కాబట్టి, పొడి ప్రదేశం ఉత్తమం. పైగా ఫ్రిజ్‌లోని ఇతర పదార్థాలు కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది. మొత్తం మీద ఎప్పటికప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ ని తయారు చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే వంట రుచి కూడా సూపర్‌గా ఉంటుంది.

## ఎముకలకు పుష్టినిచ్చే ఆహారాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** చలి కాలంలో ఎముకలు, కీళ్ళు నొప్పులు తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో యువత కూడా కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి అతిపెద్ద కారణం కాల్షియం లోపం. అందుకు కారణం ప్రోటీన్ కు ఇచ్చిన ప్రాముఖ్యత కాల్షియంకు ఇవ్వకపోవడమే. నేటి జీవనశైలి కారణంగా ఉదయం ఎండలో నడిచేవారే కరువయ్యారు. దీంతో శరీరంలో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఎముకలు పెళుసుగా మారుతాయి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండేవారికి కూరగాయల ద్వారా పుష్కలంగా కాల్షియం అందుతుంది. అవేంటో తెలుసుకుందాం. నువ్వులలో ఆరు రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో వీటిని సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. 100 గ్రాముల నువ్వులలో దాదాపు 975 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. నువ్వుల లడ్డులు, చట్నీలు, సలాడ్లలో కలిపి తినవచ్చు. శీతాకాలంలో క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. అలాగే శీతాకాలంలో లభించే ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాలకూరలో కాల్షియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. కిడ్నీ బీన్స్, చిక్‌పీస్‌లో కూడా కాల్షియం అధికంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. ఒక కప్పు ఉడికించిన శనగల్లో 80 నుండి 100 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది ప్రోటీన్, ఫైబర్, ఐరన్‌ను కూడా అందిస్తుంది. చల్లని చిక్‌పీస్, కిడ్నీ బీన్స్‌తో తయారు చేసిన వంటకాలు ఎముకలకు బలాన్నిస్తాయి. ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు బలంగా ఉంటాయి. రోజుకు 4 నుండి 5 ఎండిన అంజీర్ పండ్లను తినడం వల్ల అవి శరీరానికి కాల్షియం అవసరాన్ని సులభంగా తీరుస్తాయి. బాదం.. శరీరంలో కాల్షియం పనితీరును మెరుగుపరుస్తుంది. బాదం మెదడుతో పాటు ఎముకలకు కూడా మంచిది. 100 గ్రాముల బాదంలో సుమారు 260 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. చల్లని వాతావరణంలో రోజూ 5 నుంచి 7 బాదం పలుకులు నానబెట్టి తినడం వల్ల చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగులు.. మూడు గ్లాసుల పాలలో ఉన్నంత శక్తిని కలిగి ఉంటాయి. ఎందుకంటే కేవలం 100 గ్రాముల రాగులతో శరీరానికి సుమారు 350 మిల్లీ గ్రాముల కాల్షియం అందుతుంది. పిల్లలు నుంచి మహిళలు, సీనియర్ సిటిజన్లు.. ఇలా అందరికీ రాగులతో ప్రయోజనాలు ఉన్నాయి.

## 120 బంతుల్లో 74 డాట్ బాల్స్.. RCB జట్టులో
# అదరగొడుతున్న లేడీ హేజల్ వుడ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో జోష్ హేజల్ వుడ్ ఎలాంటి బౌలింగ్ తో ఆకట్టుకున్నాడో తెలిసిందే. పిచ్ తో సంబంధం లేకుండా ఎలాంటి స్టార్ బ్యాటర్ అయినా ఈ ఆసీస్ బౌలర్ కంట్రోల్ చేయగలడు. స్వింగ్, బౌన్స్ తో పాటు లైన్ అండ్ లెంగ్త్ తో దడ పుట్టే బంతులను వేస్తాడు. గత సీజన్ ఐపీఎల్ లో హేజల్ వుడ్ పవర్ ప్లే బౌలింగ్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. బ్యాటర్లు రెచ్చిపోయే పవర్ ప్లే లో.. హేజాల్ వుడ్ తన వైవిధ్యమైన బంతులతో డాట్ బాల్స్ వేసేవాడు. డాట్ బాల్స్ వేయడంలో ఈ ఆసీస్ పేసర్ తనకు తానే సాటి. మహిళా ప్రీమియర్ లీగ్ లో కూడా ఒక పేసర్ హేజాల్ వుడ్ ను గుర్తు చేస్తుంది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అమ్మాయిలు రప్ఫాడిస్తున్నారు. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అందరికంటే ముందే ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకున్నారు. ఈ సీజన్ లో ఆర్సీబీ విజయాల్లో ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ లారెన్ బెల్ తన బౌలింగ్ తో విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వచ్చింది. ఆడిన మ్యాచ్ ల్లో పొదుపుగా బౌలింగ్ చేసింది. 5 మ్యాచ్ ల్లో 9 వికెట్లు పడగొట్టిన బెల్.. ఓవరాల్ గా 120 బంతుల్లో ఏకంగా 74 డాట్ బాల్స్ వేసి ఆశ్చర్యపరిచింది. ఆడిన 5 మ్యాచ్ ల్లో నాలుగు ఓవర్ల కోటా వేసిన ఈ ఇంగ్లాండ్ పేసర్ ఒక్క మ్యాచ్ లో కూడా 30 పరుగులు ఇవ్వకపోవడం విశేషం.

తొలి మ్యాచ్ ల్లో నాలుగు ఓవర్లలో కేవలం 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టింది. రెండు మ్యాచ్ లో నాలుగు ఓవర్లలో 16 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసుకుంది. మూడో మ్యాచ్ ల్లో 29 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు.. నాలుగో మ్యాచ్ లో 26 పరుగులు ఇచ్చి మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. తాజాగా సోమవారం (జనవరి 19) గుజరాత్ జెయింట్స్ పై నాలుగు ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి వికెట్ తీసుకుంది. పవర్ ప్లే లో లారెన్ బెల్ ప్లేయర్లను కట్టడి చేయడంతో ఆర్సీబీ జట్టుకు పట్టు లభిస్తోంది. బెల్ బౌలింగ్ ను పొగుడుతూ ఫ్యాన్స్ లారెన్ బెల్ నుఆర్సీబీ మెన్స్ జట్టులోని జోష్ హేజాల్ వుడ్ తో పోలుస్తున్నారు. ఆర్సీబీ మహిళా జట్టులో కూడా ఒక హేజల్ వుడ్ ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ప్లే ఆఫ్స్ కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు:**

సోమవారం (జనవరి 19) జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 61 రన్స్ తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 178/6 స్కోరు చేసింది. యంగ్ సెన్సేషన్ గౌతమి నాయక్ (55 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 73) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. రిచా ఘోశ్ (27), కెప్టెన్ స్మృతి మంధాన (26) కూడా రాణించారు. గుజరాత్ బౌలర్లలో కాశ్మీ గౌతమ్, గార్డ్‌నర్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం ఛేజింగ్‌లో గుజరాత్ 20 ఓవర్లలో 117/8 స్కోరు మాత్రమే చేసి ఓడింది. కెప్టెన్ యాష్లే గార్డ్‌నర్ (43 బాల్స్‌లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) తప్ప మిగతా బ్యాటర్లు ఫెయిలయ్యారు. సయాలీ సత్ఘారే (3/21) మూడు వికెట్లతో దెబ్బకొట్టింది. గౌతమి నాయక్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# కిషాన్ ఇన్.. అర్షదీప్ ఔట్: తొలి టీ20కి ఆసక్తికరంగా టీమిండియా ప్లేయింగ్ 11





**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ చేజార్చుకున్న టీమిండియా.. టీ20 సిరీస్ కోసం సిద్ధమవుతోంది. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా తొలి టీ20 బుధవారం (జనవరి 21) నాగ్‌పూర్ వేదికగా విదర్భ క్రికెట్ అసోసియేషన్ లో జరగనుంది. వరల్డ్ కప్ స్వదేశంలో జరగనుండడంతో ఈ 5 టీ20 మ్యాచ్ లను ఇండియా ప్రాక్టీస్ గా ఉపయోగించుకోవాలని చూస్తుంది. సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియా అన్ని విభాగాల్లో పటిష్టంగా కనిపిస్తుంది. మ్యాచ్ సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభం కానుంది. తొలి టీ20 మ్యాచ్ లో ఇండియా ప్లేయింగ్ 11 ఎలా ఉండబోతుందో ఇప్పుడు చూద్దాం. అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నారు. బ్యాకప్ వికెట్ కీపర్ ఇషాన్ కిషాన్ మూడో స్థానంలో ఆడే అవకాశం ఉంది. వరల్డ్ కప్ కు కిషాన్ సెలక్ట్ అయ్యాడు. మరోవైపు శ్రేయాస్ కేవలం న్యూజిలాండ్ టీ20 సిరీస్ కు మాత్రమే ఎంపికయ్యాడు. ఈ కారణంగా గాయపడిన తిలక్ వర్మ స్థానంలో జట్టులో వచ్చిన శ్రేయాస్ అయ్యర్ కు ప్లేయింగ్ 11లో చోటు దక్కే అవకాశాలు లేవు. వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉన్న కిషాన్ కు ఛాన్స్ ఇవ్వనున్నట్టు సమాచారం. నాలుగో స్థానంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ బ్యాటింగ్ కు వస్తాడు. ఐదో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య స్థానానికి ఎలాంటి ఢోఖా లేదు.ఆరో స్థానంలో రింకూ సింగ్ లేదా శివమ్ దూబేలలో ఒకరు జట్టులోకి రానున్నారు. దూబే ఆల్ రౌండర్ కావడంతో ఛాన్స్ లభించే అవకాశం ఉంది. ఏడో స్థానంలో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ స్థానం పక్కా. ఎనిమిదో స్థానంలో హర్షిత్ రానాకు ఛాన్స్ దక్కొచ్చు. ఇటీవలే న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో హర్షిత్ బౌలింగ్ తో పాటు బ్యాటింగ్ లోనూ అదరగొట్టాడు. దీంతో జట్టు యాజమాన్యం రానా వైపే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి స్థానాలు కన్ఫర్మ్ అయిపోయాయి. ఫాస్ట్ బౌలర్ గా జస్ప్రీత్ బుమ్రా జట్టులో కొనసాగుతాడు. తొలి టీ20కి రింకూ సింగ్, అర్షదీప్ సింగ్, ఇషాన్ కిషాన్,రవి బిష్ణోయ్ బెంచ్ కు పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి.

**న్యూజిలాండ్ తో తొలి టీ20కి ఇండియా ప్లేయింగ్ 11 (అంచనా)**

అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషాన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్

# ఇండియాలో వరల్డ్ కప్ ఆడం.. ఐసీసీ ఒత్తిడికి ఆలోచన మార్చుకోము: బంగ్లాదేశ్ స్పోర్ట్స్ అడ్వైజర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2026 ఐసీసీ టీ20 వరల్డ్ కప్ లో బంగ్లాదేశ్ ఆడే సూచనలు కనిపించడం లేదు. భద్రతా కారణాలు చూపిస్తూ ఇండియాలో అడుగు పెట్టమని ఇప్పటికే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐసీసీకి చాలా సార్లు చెప్పింది. అయితే ఐసీసీ బంగ్లాదేశ్ కు మరోసారి ఆలోచించుకోమని అవకాశం ఇచ్చింది. బుధవారం (జనవరి 21) లోపు తమ సమాధానాన్ని చెప్పాల్సిందిగా డెడ్ లైన్ విధించింది. ఈ డెడ్ లైన్ విధించిన మాత్రానా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ మంగళవారం (జనవరి 20) ఖరాఖండిగా చెప్పారు.

ఒకవేళ ఇండియా రావడానికి బంగ్లాదేశ్ నిరాకరిస్తే టోర్నమెంట్ నుంచి తొలగించబడుతుంది. బంగ్లాదేశ్ స్థానంలో మరో జట్టు వరల్డ్ కప్ ఆడుతుంది. ర్యాంకింగ్స్ ప్రకారం స్కాట్లాండ్ జట్టు బంగ్లాదేశ్ స్థానంలో ఆడనుంది. భద్రతా సమస్యల వల్లే ఇండియాలో పర్యటించేందుకు తాము వెనకడుగు వేస్తున్నామని బంగ్లాదేశ్ బోర్డు ఇప్పటికే చాలాసార్లు తమ నిర్ణయాన్ని వెల్లడించింది. సాధ్యమైన పరిష్కారం కోసం మరోసారి ఐసీసీతో చర్చలు జరుపుతామని తెలిపింది. ఒక పక్క ఐసీసీ బంగ్లాదేశ్ భద్రతకు హామీ ఇచ్చినా ఆ దేశ క్రికెట్ బోర్డు ఇండియా రావడానికి సిద్ధంగా లేదు.టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది.

వరల్డ్ కప్ లో తమ స్థానాన్ని వేరే జట్టుతో రీప్లేస్ చేస్తారనే బెదిరింపు ఉన్నప్పటికీ బంగ్లాదేశ్ జట్టు ఇండియాకు వచ్చి క్రికెట్ ఆడమని నజ్రుల్ స్పష్టంగా చెప్పారు. నజ్రుల్ విలేకరులతో మాట్లాడుతూ.."భారత క్రికెట్ బోర్డు ఒత్తిడికి ఐసీసీకి తలొంచి మాపై ఒత్తిడి తీసుకు రావడానికి ప్రయత్నిస్తుంది. షరతులు విధించడం ద్వారా మాపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తే మేము ఆ షరతులను అంగీకరించము". అని నజ్రుల్ అన్నారు. ఐసీసీ విధించిన గడువుకు ఇంకా ఒక్క రోజు మాత్రమే ఉండడంతో నజ్రుల్ తమ నిర్ణయాన్ని ఖరాఖండిగా చెప్పుకొచ్చాడు.

# నాకు ఎలాంటి లిమిట్స్ లేవు.. ఐటెం సాంగ్స్ కు రెడీ!







సోషల్ మీడియా వాడకం పెరిగిన తర్వాత ఎవరికి నచ్చింది వాళ్లు రాసేసుకుంటున్నారు. ఎదుటి వారు రాసిన దాంట్లో ఎంత నిజముందనేది కూడా పట్టించుకోకుండా ఆ వార్తలను ప్రచారం చేస్తుంటారు మరికొందరు. ఇలానే రూమర్లు మొదలవుతాయి. అయితే ఈ రూమర్లు పబ్లిక్ లైఫ్ లో ఉండే సెలబ్రిటీలపై ఎక్కువగా వస్తుంటాయనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

**మైసా షూటింగ్ లో రష్మిక బిజీ**

నేషనల్ క్రష్ రష్మిక మందన్నాపై కూడా ఇలాంటి వార్తలెన్నో వచ్చాయి. ఛలో సినిమాతో టాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయమైన రష్మిక చాలా తక్కువ టైమ్ లోనే అగ్ర హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్ గా ఎదిగారు. గతేడాది కుబేర, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ప్రేక్షకుల్ని విపరీతంగా మెప్పించిన రష్మిక ప్రస్తుతం మైసా అనే సినిమాతో బిజీగా ఉన్నారు.

**అప్పట్నుంచి ఒకేలా పని చేస్తున్నా**

అయితే రష్మిక ఎంత బిజీగా ఉన్నా ఫ్యాన్స్ తో మాత్రం రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటారు. రీసెంట్ గా ఓ చిట్ చాట్ లో ఫ్యాన్స్ ప్రశ్నలకు సమాధానాలిస్తూ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను చెప్పారు రష్మిక. తాను 2016 నుంచి ఇప్పటివరకు ఒకేలా పని చేస్తున్నానని, అన్ని భాషల్లో, అన్ని రకాల జానర్ల సినిమాల్లోనూ యాక్ట్ చేయాలనేదే తన కోరిక అని రష్మిక చెప్పుకొచ్చారు.

**డబ్బు కోసమే రూమర్లు క్రియేట్ చేస్తారు**

తనకు భాష పరంగా ఎలాంటి లిమిట్స్ లేవని, తాను నటినని, నటి పని ఆడియన్స్ ను ఎంటర్టైన్ చేయడమేనని, ఒక్కొక్కరికి ఒక్కో తరహా సినిమాలు నచ్చుతుంటాయని, అందుకే అందరినీ మెప్పించడానికి డిఫరెంట్ డిఫరెంట్ సినిమాలు చేయడానికి ట్రై చేస్తుంటానని ఆమె చెప్పారు. ఇక నెగిటివిటీ గురించి మాట్లాడుతూ, కొందరు కావాలని వ్యూస్ తో వచ్చే డబ్బు కోసం రూమర్లు క్రియేట్ చేస్తారని, మొదట్లో అవి విని చాలా బాధ పడ్డానని, తర్వాత వాటిని ఫేస్ చేయాలో నేర్చుకున్నానని, లైఫ్ లో జరిగిన ప్రతీ విషయం నుంచి ఏదొకటి నేర్చుకుంటూ ముందుకెళ్తున్నట్టు రష్మిక చెప్పారు.

**నేనేమీ హీరోని కాదు**

ఇండస్ట్రీలో అందరికంటే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకునే హీరోయిన్ తానేనని వస్తున్న వార్తలపై కూడా రష్మిక రియాక్ట్ అయ్యారు. అందరూ అంటున్నట్టు, అనుకుంటున్నట్టు ఆ వార్త నిజమైతే బావుంటుందని, తాను కూడా దాని కోసమే వెయిట్ చేస్తున్నానని, ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకోవడానికి తానేమీ హీరోని కాదని చెప్పిన రష్మిక, ఐటెం సాంగ్స్ చేయడానికి కూడా తాను సిద్ధమేనని, కానీ ఆ సినిమాలో లీడ్ రోల్ కూడా తానే చేయాలని అప్పుడే స్పెషల్ సాంగ్స్ చేస్తానని రష్మిక చెప్పారు. కాకపోతే ఓ ముగ్గురు డైరెక్టర్లు అడిగితే తాను లీడ్ రోల్ కాకపోయినా సరే వారి సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేయడానికి రెడీ అని, కానీ ఆ డైరెక్టర్లు ఎవరనేది మాత్రం తాను చెప్పనని రష్మిక వెల్లడించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965